www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO. APTEL/2010/33229

| సంపుటి : 17 | సంచిక :76 | మంగళవారం 21.04.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/- |
|---|---|---|---|---|---|

**విలేకరులు కావలెను**

17 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

# రీ-డిజైన్ పేరుతో భారీ దోపిడీ..

## బీజేపీ విచారణ భయంతోనే ఢిల్లీకి

2023లో మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం అవినీతి ఫలితం

దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక


- కేసీఆర్ కుటుంబంపై అవినీతి ఆరోపణలు
- ప్రాజెక్ట్ రీ-డిజైన్ పేరుతో భారీ కమీషన్లు జరిగాయని విమర్శ
- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును మార్చి కాళేశ్వరంగా చేశారని ఆరోపణ
- అంచనా వ్యయం ₹38,000 కోట్ల నుంచి ₹1 లక్ష కోట్లకు పెరిగిందని వ్యాఖ్య
- కాళేశ్వరం "ప్రపంచ అద్భుతం" అంటూ ప్రజలను మోసం చేశారని విమర్శ
- 2023లో మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం అవినీతి ఫలితం అన్న వ్యాఖ్య
- నేషనల్ డ్యామ్ సేఫ్టీ రిపోర్ట్‌లో ప్రాజెక్ట్ వైఫల్యాలు బయటపడ్డాయని వెల్లడింపు
- ప్రాజెక్ట్ నిర్మాణం, నాణ్యత, ప్లానింగ్‌లో లోపాలు ఉన్నాయని ఆరోపణ
- దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- హరీష్ రావు ఢిల్లీ పర్యటనపై కూడా విమర్శలు
- బీజేపీ విచారణ భయంతోనే ఢిల్లీ వెళ్లారని సంచలన వ్యాఖ్యలు
- కేంద్రం స్పందించకపోవడంపై ప్రశ్నలు
- ప్రాజెక్ట్ పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని స్పష్టం
- సాంకేతిక నిపుణులతో కలిసి మరమ్మతులు కొనసాగుతున్నాయి

03





**జయశంకర్ భూపాలపల్లి,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన ఆయన, కుంగిన పిల్లర్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబంపై, కేంద్రంలోని బీజేపీ వైఖరిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక అంశాలను ప్రస్తావించారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తుమ్మడిహట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని.. అయితే కేసీఆర్ మాత్రం ఆర్థిక ప్రయోజనం లేదనే సాకుతో దాన్ని రీడిజైన్ చేశారని మండిపడ్డారు.



# బీఆర్ఎస్‌లో చేరిన జీవన్ రెడ్డి..

- జీవన్ రెడ్డితో పాటు వచ్చి బీఆర్ఎస్ లో చేరిన ప్రతి ఒక్కరికి స్వాగతం
- నేను జీవన్ రెడ్డి నలభై ఏళ్లుగా మిత్రులం
- జీవన్ రెడ్డి చాలా మంది కి ఆదర్శంగా నిలిచిన వ్యక్తి
- జీవన్ రెడ్డిని పార్టీ ప్రధాన కార్యదర్శి గా ఇప్పుడే అపాయింట్ చేస్తున్నాను: కేసీఆర్
- అభివృద్ధికి రాజకీయాలు లేవు
- 10 జిల్లాల తెలంగాణ రాష్ట్రాన్ని 23 జిల్లాలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే
- రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కూడా కేసీఆర్‌దే
- కేసీఆర్ జగిత్యాలకు వస్తే.. అప్పుడే నిద్రలేచినట్టు రేవంత్ రెడ్డి నటిస్తున్నారు. -జీవన్ రెడ్డి

03

కేటీఆర్ సభకు హాజరు కాలేకపోవడం చర్చనీయాంశం

**కరీంనగర్ ,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో కీలక మార్పు చోటుచేసుకుంది. సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి అధికారికంగా బీఆర్ఎస్ గూటికి చేరారు. జగిత్యాలలో నిర్వహించిన భారీ 'ప్రజా ఆశీర్వాద సభ' వేదికగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జగిత్యాల పార్టీ కార్యాలయం నుండి కేసీఆర్ భారీ కాన్వాయ్‌తో సభా ప్రాంగణానికి బయలుదేరారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు అభివాదం చేస్తూ ఆయన వేదిక వద్దకు చేరుకున్నారు.

# బీఆర్ఎస్‌లో వర్గపోరు!

## బీజేపీ వైపు హరీశ్ రావు చూపు !

- ఢిల్లీ పర్యటనపై రాజకీయ దుమారం
- సభ సమయంలోనే పర్యటన అనుమానాలు
- కాంగ్రెస్: బీఆర్ఎస్‌లో వర్గపోరు ఆరోపణ
- బీజేపీ జాయిన్ అవుతారన్న ప్రచారం
- బీఆర్ఎస్: లీగల్ మీటింగ్స్ కోసమే ఢిల్లీ ట్రిప్
- కాళేశ్వరం & ఫిరాయింపు కేసులపై చర్చలు
- ఏడాది తర్వాత సభలో కేసీఆర్ హాజరు కీలకం
- బీఆర్ఎస్ త్రిసభ్య కమిటీ ఢిల్లీకి వెళ్లినట్లు క్లారిటీ

హరీశ్ రావు ఎపిసోడ్‌పై కాంగ్రెస్ ఎటాక్

03

# నిర్ణయం ప్రభుత్వానిదే

## నేతాజీని జాతీయ పుత్రుడిగా ప్రకటించలేం.. తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు

- నేతాజీని "జాతీయ పుత్రుడు"గా ప్రకటించాలి
- ఇవి ప్రభుత్వ విధాన నిర్ణయాలు, కోర్టు పరిధిలోకి రావు
- ఇదే అంశంపై గతంలో కూడా పిల్ దాఖలు చేసినట్టు గుర్తింపు
- కోర్టు తీవ్ర ఆగ్రహం ప్రచారం కోసం పిటిషన్ అంటూ వ్యాఖ్య
- మళ్లీ ఇలాంటి పిటిషన్లు వేయొద్దు

02





# గచ్చిబౌలిలో భారీ అగ్నిప్రమాదం..

- గచ్చిబౌలిలో అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో అగ్నిప్రమాదం
- ఎలక్ట్రికల్ ప్యానెల్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు ప్రారంభం
- 15 ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధం
- అపార్ట్‌మెంట్ అంతా దట్టమైన పొగ
- పొగ పీల్చడంతో ఇద్దరు నివాసితులకు అస్వస్థత..

02

# కబ్జా స్థలంలో మీటింగ్ పెట్టి...

- బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందని ఆరోపణ
- సీతారామ ప్రాజెక్ట్‌ను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శ
- ప్రభుత్వం పనులు పూర్తి చేస్తోందని పేర్కొన్నారు
- సత్తుపల్లి టన్నెల్‌కు ₹1500 కోట్లు మంజూరు చేసినట్టు వెల్లడించారు
- గోదావరి జలాలను పైరా రిజర్వాయర్‌కు తరలించిన ప్రభుత్వం ఇదేనన్నారు
- రైతు బంధు, సీఎం రిలీఫ్ ఫండ్‌లో స్కాంలు జరిగాయని ఆరోపణ ₹25,000 కోట్ల రుణమాఫీ రైతుల ఖాతాల్లో జమ చేశామని క్లెయిమ్
- గత 10 ఏళ్ల విధ్వంసాన్ని సరిచేస్తున్నామని వ్యాఖ్య
- హరీష్ రావు తన స్థాయి తెలుసుకుని మాట్లాడాలని హితవు

05



కబ్జా స్థలంలో మీటింగ్ పెట్టి మాకు నీతులు చెబుతున్నారా అంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. సోమవారం ఖమ్మం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిన్న జన్మదిన వేడుకల్లో.. ఆత్మీయ సమ్మేళనమే నాకు తెలియదు కానీ, హరీష్ రావు మాట్లాడే తీరును చూస్తే ఆయన మానసిక స్థితి సరిగా...



# లోయలో పడ్డ బస్సు.. 15 మంది మృతి

02

జమ్ముకశ్మీర్లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. ఉదంపూర్ జిల్లాలో సోమవారం బస్సు లోయలోపడి 15 మంది దుర్మరణం చెందారు. చాలామంది గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగనుందని అధికారులు తెలిపారు. ఉదంపూర్ జిల్లాలోని రామ్నగర్ ప్రాంతంలో కాగోర్ట్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.



# సయోధ్య కుదిరేనా?

## నేడు ఇరాన్ - అమెరికా మధ్య శాంతి చర్చలు

- నేడుపాక్ లోని ఇస్లామాబాద్ వేదికగా సమావేశం
- అమెరికా తరుఫున హాజరుకానున్న జేడీ వాన్స్
- ఈ చర్చల కోసం షరతులు పెట్టిన ఇరాన్
- ఒప్పుకుంటేనే శాంతి చర్చలకు వస్తామని ప్రకటన

02

# నిర్ణయం ప్రభుత్వానిదే

## నేతాజీని జాతీయ పుత్రుడిగా ప్రకటించలేం.. తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు

**ఢిల్లీ :** నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలోని ఇండియన్ నేషనల్ ఆర్మీ వల్లే భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ప్రకటించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. భవిష్యత్తులో ఇలాంటి నిరాధారమైన వ్యాజ్యాలు దాఖలు చేస్తే సుప్రీంకోర్టులోకి ప్రవేశించకుండా అడ్డుకుంటామని పిటిషనర్‌ను హెచ్చరించింది. దేశానికి స్వాతంత్ర్యం రావడంలో నేతాజీ నేతృత్వంలోని ఐఎన్‌ఏదే కీలక పాత్ర అని ప్రకటించడంతో పాటు నేతాజీని జాతీయ పుత్రుడిగా గుర్తించి ఐఎన్ఏ వ్యవస్థాపక దినోత్సవమైన అక్టోబర్ 21ను, నేతాజీ జయంతి జనవరి 23ను జాతీయ దినోత్సవాలుగా ప్రకటించాలని పినాక్పాణి మొహంతి అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఇవాళ విచారణ చేపట్టింది.

**నిర్ణయం ప్రభుత్వానిదే:**

ఇవాళ విచారణ జరిపిన ధర్మాసనం ఇదే అంశంపై గతంలో కూడా సదరు వ్యక్తి పిటిషన్ దాఖలు చేస్తే అప్పుడే దానిని కోర్టు కొట్టివేసిందని విచారణ సందర్భంగా ధర్మాసనం గుర్తు చేసింది. ఇలాంటి విషయాలు న్యాయ సమీక్షా పరిధిలోకి రావని ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారుల వద్దే వీటిని లేవనెత్తాలని గతంలోనే స్పష్టం చేసినట్లు ధర్మాసనం గుర్తు చేసింది. గతంలోనే స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ మళ్లీ అదే అంశంపై పిటిషన్ దాఖలు చేయడంపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదంతా కేవలం ప్రచారం కోసమే చేస్తున్నారని మండిపడింది.

**పిటిషన్లు స్వీకరించవద్దు:**

పిటిషనర్ వైఖరిపై సీజేఐ సూర్యకాంత్ తీవ్రంగా స్పందిస్తూ ఇక అక్కడి నుండి వెళ్లండి లేదంటే భారీ జరిమానా విధిస్తా అని హెచ్చరించారు. అలాగే ఇలాంటి అంశాలపై సదరు పిటిషనర్ భవిష్యత్తులో పిటిషన్లు దాఖలు చేస్తే వాటిని స్వీకరించవద్దని సుప్రీంకోర్టు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

# గచ్చిబౌలిలో భారీ అగ్నిప్రమాదం..

**గచ్చిబౌలి,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న టిఎన్జీవో కాలనీలో సోమవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఒక అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం సంభవించినప్పటికీ, ప్రాణనష్టం తప్పింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, అపార్ట్‌మెంట్ సెల్లార్ లోని ఎలక్ట్రికల్ ప్యానెల్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు మొదలయ్యాయి. సెల్లార్‌లో పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలకు ఈ మంటలు వేగంగా అంటుకున్నాయి. నిమిషాల వ్యవధిలోనే అపార్ట్మెంట్ అంతా దట్టమైన నల్లటి పొగ కమ్మేసింది. పొగ కారణంగా పై అంతస్తుల్లో ఉన్న నివాసితులు ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈ అగ్నిప్రమాద ఘటనలో సెల్లార్ లో పార్క్ చేసిన సుమారు 15 ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. పొగ పీల్చడం వల్ల అపార్ట్మెంట్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు సమాచారం. సమాచారం అందిన వెంటనే గచ్చిబౌలి ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అపార్ట్మెంట్ లోపల

చిక్కుకున్న వారిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. నిచ్చెనల సాయంతో పై అంతస్తుల నుంచి బాధితులను సురక్షితంగా కిందకు దించారు. అగ్నిమాపక యంత్రాలతో నీటిని చల్లి మంటలు ఇతర ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అటు అపార్ట్‌మెంట్ వాసులు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం పోలీసులు ఆస్తి నష్టంపై అంచనా వేస్తున్నారు.

# శ్రీ బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవంలో మాజీ మంత్రి

**సీతాఫలమండి,ఫ్లాష్ ఇండియా :** సికింద్రాబాద్ సీతాఫల్ మండి డివిజన్ పరిధిలోని మధురా నగర్‌లో కొలువైన శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయం స్థాపనకు 10 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా సోమవారం వార్షికోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన పూజలు, హోమాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేసిన కమిటీ సభ్యులను అభినందించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్ గౌడ్, అధ్యక్షుడు బాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ధన శేఖర్, ఉపాధ్యక్షుడు ప్రకాష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రుణాలు చెల్లించని మహిళా గ్రూపులకు ఆర్ ఆర్ ఏ యాక్ట్ నోటీసులు..!

**వెల్దుర్తి,ఫ్లాష్ ఇండియా :** మండల కేంద్రంలో శ్రీ శక్తి భవనంలో మండల సమైక్య అధ్యక్షురాలు రూప అధ్యక్షతన సోమవారం మండల మహిళా సమైక్య సమావేశం నిర్వహించామని ఐకెపి, ఏపిఎం సుభాష్ గౌడ్ తెలిపారు. సంఘ సభ్యుల ఉద్దేశించి ఏపిఎం సుభాష్ గౌడ్ మాట్లాడారు. 2025 -26 ఆర్థిక సంవత్సరం 369 సంఘాలకు రూ. 381.4 కోట్లు లోన్లు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. బ్యాంకు లింకేజీ ఎన్. పి. ఏ. సంఘాలు 45 ఉండగా, వారికి అమౌంట్ 113.64 కోట్ల ఇవ్వడం జరిగిందన్నారు. శ్రీనిధి ఎన్ పి ఏ ఉన్న సంఘాలు 101 వీరికి గాను మొత్తం అమౌంట్ 88 44 311 రుణాలు తీసుకొని కట్టని సంఘాలు ఉన్నాయని తెలిపారు. మండల మహిళా సమైక్యకు ప్రభుత్వం తరఫున ఆర్టీసీ బస్సు రావడం జరిగిందని పేర్కొన్నారు. ఎన్ పి ఏ ఉన్న సంఘాలు ఈనెల లాస్ట్ వరకు తీసుకున్న లోన్లు కట్టకపోతే ఆ సంఘం సభ్యులకు ఆర్ ఆర్ ఏ ఆక్ట్ కింద నోటీసులు ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు.. ఉద్యమ రిజిస్టర్ పై ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. అన్ని ఎస్ సి ఆర్ పి చేసే పలు అంశాల పైన మహిళా శక్తికి సంబంధించిన అన్ని అంశాల పైన చర్చించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డి ఎం జి లాలూ నాయక్, సీసీలు సుల్తానా విజయలక్ష్మి, లక్ష్మణ్, స్వప్న, కార్యదర్శి భాగ్యరాణి, నరసమ్మ, వివోఏలు, ఎమ్మెస్ ఎ గీత, ఎం సి ఓ గంగాధర్, సి ఆర్ పి లు శివ, అన్ని గ్రామ సంఘాల అధ్యక్షురాలు ఉన్నారు.





# అంగన్వాడీ టీచర్ల సేవలు అభినందనీయం

**మునుగోడు,ఫ్లాష్ ఇండియా :** అంగన్వాడీ టీచర్లు సమాజంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని, వారి పోస్టు చిన్నదైనా సేవలు ఎంతో గొప్పవని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా పాలన ప్రగతి -- 99 రోజుల ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గంలోని 357 మంది అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు సంవత్సరాల లోపు బాల బాలికలను అంగన్వాడీ టీచర్లు కన్నతల్లిలా చూసుకుంటున్నారని కొనియాడారు. వారికి ప్రభుత్వం ఎంత చేసినా తక్కువేనని పేర్కొన్నారు. టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత పాలకుల కాలంలో ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే స్వేచ్ఛ ప్రజాప్రతినిధులకు ఉండేదికాదని, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ఆ స్వేచ్ఛ కల్పించబడిందన్నారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను సందర్శించి, స్వయంగా తయారు చేసిన పౌష్టికాహార పదార్థాలను రుచి చూశారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు యూనిఫార్ములను అందజేశారు. ఈ కార్యక్రమంలో చండూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాస్, ఎంపీడీవో యుగేందర్, తహశీల్దార్ నరేష్, సీడీపీవో లావణ్య, మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహగౌడ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు, వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# లోయలో పడ్డ బస్సు.. 15 మంది మృతి

**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. ఉదంపూర్ జిల్లాలో సోమవారం బస్సు లోయలోపడి 15 మంది దుర్మరణం చెందారు. అనేక మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉందని అధికారులు పేర్కొం టున్నారు. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఉదంపూర్ జిల్లాలోని రామ్ నగర్ ప్రాంతంలో కాగోర్ట్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఉదయం 10 గంటల సమయంలో ఒకమలుపు వద్ద బస్సు తిరుగుతుండగా కొండపై నుంచి కిందకు పడిపోయింది. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది ఘట నాస్థలికి చేరుకుని స

హాయక చర్యలు చేపట్టారు. క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలించారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# సయోధ్య కుదిరేనా?

**ఢిల్లీ :** పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకుం టున్నాయా అంటే పరిస్థితులు అవుననే చెబుతు న్నాయి. హర్మూజ్ జలసంధిలో అమెరికా ఇరాన్ మధ్య తలెత్తిన తాజా పరిణామాలు ప్రపంచవ్యా ప్తంగా ఆందోళనలకు దారితీస్తున్నాయి. జలసంధి పూర్తిగా ఓపెన్ అయిందని చెబుతున్నా... నౌకలను సీజ్ చేస్తుండటం, కాల్పులు జరుగుతున్నాయి. ఒకవైపు శాంతి చర్చల మాటలు వినిపిస్తుండగానే, యుద్ధవాతావరణం నెలకొనడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.

**రేపే రెండో విడుత చర్చలు**

ఇరాన్ ఖండన రెండో విడత శాంతి చర్చల్లో భాగంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఓ కీలక ప్రకటన చేశారు. పాకిస్తాన్ వేదికగా రెండో విడత చర్చలు ఉంటాయని, మంగళ వారం ఈ భేటీ ఉంటుందని తెలిపారు. ఈ చర్చలలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాయకత్వంలో ఒక బృందం పాల్గొననుందని వెల్లడించారు. ఇదే సమయంలో శాంతి చర్చల మాట మాట్లాడుతూనే ఇరాన్కు హెచ్చరికలు కూడా జారీ చేశాడు. తాము చెప్పిన ఒప్పందానికి ఇరాన్ ఒప్పుకొని తీరాలని, లేదంటే ఇరాన్లోని విద్యుత్ కేంద్రాలు, వంతెలను ధ్వంసం చేస్తామని హెచ్చరించాడు.

**చర్చలకు ఇరాన్ నో**

చర్చలు అంటూనే హెచ్చరికలు జారీ చేయడంతో ఇరాన్ మండి పడింది. చర్చల వార్తలను కొట్టిపారేసింది. ఇస్లామాబాద్లో ఎలాంటి చర్చలు జరగడం లేదని, ఇదంతా అమెరికా ఆడుతున్న మైండ్‌గేమ్లో భాగమేనని ఇరాన్ అధికారిక వార్త సంస్థ స్పష్టం చేసింది. చర్చలనేవి వట్టిమాటలేనని, ఇరాన్ను నాశనం చేయడమే వారి లక్ష్యమని ఇరాన్ సైన్యం చెబుతోంది. అమెరికా ఎలాంటి దాడులకు తెగబడినా దానికి తగిన సమాధానం చెబుతామని హెచ్చరించింది. ఇదే సమయంలో తాము చర్చలు జరపాలంటే హర్మూజ్ జలసంధి సముద్ర ప్రాంతం నుంచి అమెరికా దళాలు తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఒక వైపు చర్చలంటూ, మరో వైపు హర్మూజ్ కు నౌకలు రాకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించింది.

**నౌక సీజ్.. డ్రోన్లతో ప్రతీకారం**

ఎలాగైనా ఇరాన్ పోర్టులను దిగ్బంధం చేయాలని అనుకున్న అమెరికా....హర్మూజ్ జలసంధిలోకి అడుగుపెట్టడానికి పలు ప్రయత్నాలు చేసింది. కానీ వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో జలసంధి బయట పెద్ద ఎత్తున మోహరించాయి. జలసంధిగుండా వచ్చే నౌకలను సీజ్ చేయాలనీ చూశాయి. ఇందులో భాగంగానే గల్ఫ్ ఆఫ్ ఒమన్ గుండా ఇరాన్ జెండాతో వెళ్తున్న ఓ నౌకను అమెరికా దళాలు బలవంతంగా ఆపై సీజ్ చేసింది. అంత ర్జాతీయ ఆంక్షలను ఉల్లంఘించినందుకు ఈ చర్య తీసుకున్నామని హెచ్చి రించడమే కాకుండా నౌకపై రెండు రౌండ్ల కాల్పులు కూడా జరిపినట్టు అమెరికా ప్రకటించింది. ఈ సంఘటనకు ప్రతీకగా ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ రంగంలోకి దిగింది. అమెరికా యుద్ధనౌకలను లక్ష్యంగా చేసుకొని అత్యాధునిక ఆత్మాహుతి డ్రోన్లను ప్రయోగించింది. ఈ పరిణామంతో హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. డ్రోన్లతో పాటు తమ అమ్ములపొదిలోని అత్యాధునిక రాకెట్లతో విరుచుకు పడతామని హెచ్చరించింది.

# కాళేశ్వర ముక్తేశ్వరుని సన్నిధిలో సీఎం

**జయశంకర్ భూపాలపల్లి,ఫ్లాష్ ఇండియా :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం చేరుకున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా ఈ ప్రాంతంలో పర్యటిస్తుండటంతో అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. కాళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, కార్మికశాఖ మంత్రి ఎంపీ వివేక్ వెంకటస్వామి, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి సీఎం రేవంత్ రెడ్డి నేరుగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేకం చేశారు. ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

**అభివృద్ధి పనులకు శ్రీకారం**

ఆలయ దర్శనం అనంతరం, కాళేశ్వర క్షేత్ర అభివృద్ధి కోసం ఉద్దేశించిన పలు కొత్త పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. భక్తులకు కనీస వసతులు కల్పించడం, ఆలయ ప్రాంగణాన్ని విస్తరించడం వంటి అంశాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆలయ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి మేడిగడ్డ బ్యారేజ్ వద్దకు వెళ్లనున్నారు. అక్కడ బ్యారేజ్ కుంగిన ప్రాంతాన్ని పరిశీలించి, నీటిపారుదల శాఖ అధికారులతో ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మతు పనులపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం కాటారం మండలం నస్తుర్‌పల్లిలో జరిగే బహిరంగ సభలో పాల్గొని, 'రైతు భరోసా' రెండో విడత నిధులను విడుదల చేయనున్నారు. ఈ పర్యటనలో మంత్రులతో పాటు పలువురు ఉన్నతాధికారులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**మేడిగడ్డకు రేవంత్ రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కుంగిపోయిన మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ పిల్లర్లను ఆయన స్వయంగా పరిశీలించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహా ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి బ్యారేజీ వద్ద తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద కుంగిన 7వ నంబర్ పిల్లర్‌తో పాటు పగుళ్లు ఇచ్చిన ఇతర ప్రాంతాలను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులు బ్యారేజీకి జరిగిన నష్టాన్ని, పునరుద్ధరణ పనుల పురోగతిని సీఎంకు వివరించారు. పర్యటన అనంతరం ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సీఎం కీలక భేటీ నిర్వహిస్తారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు మరమ్మతు పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం రాకముందే రక్షణ చర్యలు చేపట్టాలని, నిధుల కొరత లేకుండా చూస్తామని స్పష్టం చేశారు.

**ప్రతీదీ టెక్నికల్‌గా రికార్డ్ చేయండి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీని సందర్శించారు. కుంగిపోయిన పిల్లర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, పునరుద్ధరణ పనుల తీరుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. బ్యారేజీ పునాది పరిస్థితిని అంచనా వేసేందుకు జరుగుతున్న డ్రిల్లింగ్ పనులను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. సుమారు 500 బోర్లు వేసి సాయిల్ టెస్టింగ్ (మట్టి పరీక్షలు) చేయాలని ఇప్పటికే ఆదేశించిన నేపథ్యంలో, ఆ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రిల్లింగ్ ద్వారా వెలువడుతున్న సమాచారాన్ని నిశితంగా విశ్లేషించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. బ్యారేజీ వద్ద జరుగుతున్న ప్రతీ చిన్న పనిని, పరిశీలనను సాంకేతికంగా రికార్డ్ చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇవి కీలక ఆధారాలుగా మారుతాయని పేర్కొన్నారు.

**వరదలకు ముందే డిజైన్లు..**

వర్షాకాలం ప్రారంభమై గోదావరికి వరదలు వచ్చేలోపే సాయిల్ టెస్టింగ్, రిపేర్ డిజైన్లను పూర్తి చేయాలని గడువు విధించారు. నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ అథారిటీ నిపుణులు ఇచ్చిన సూచనల ప్రకారమే ముందుకు వెళ్లాలని, భద్రతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ నిపుణులతో సీఎం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పిల్లర్లు కుంగడానికి గల లోతైన కారణాలు, పునాదిలో తలెత్తిన సమస్యలపై చర్చించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మనుగడకు మేడిగడ్డ అత్యంత కీలకమని, దీన్ని మళ్లీ వినియోగంలోకి తెచ్చేందుకు పకడ్బందీ ప్రణాళికతో పని చేయాలని అధికారులను ఉత్సాహపరిచారు. ఈ పర్యటనలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మేడిగడ్డ పరిశీలన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి నస్తూర్‌పల్లిలో జరగనున్న బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు.

**కాళేశ్వరంలో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం..**

కాళేశ్వరంలో శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయం పునరాభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ తదితరులు హాజరయ్యారు. కాళేశ్వరంలో రూ.198 కోట్లతో శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయం పునరాభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కాళేశ్వరం బస్ స్టేషన్ నిర్మాణానికి కూడా సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు



**ఎమ్మిగనూరు,ఫ్లాష్ ఇండియా :** ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌ను ఆసరాగా చేసుకుని ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠాను ఎమ్మిగనూరు పోలీసులు సోమవారం చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ కేసులో మొత్తం ఆరుగురిని నిందితులుగా గుర్తించగా, నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.22 లక్షల నగదు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎమ్మిగనూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో డి.ఎస్.పి మర్రివాడ భార్గవి ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.

**పోలీసుల దాడుల వివరాలు:**

టౌన్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ మధుసూదన్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం పక్కా సమాచారంతో దాడులు నిర్వహించింది. నిందితులు 'డెక్కన్ 247' అనే ఆన్‌లైన్ యాప్ ద్వారా ఈ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

**అరెస్టయిన వారు:**

మహమ్మద్ ఖాజా, షరీఫ్ (ఎమ్మిగనూరు టౌన్), పవన్ కుమార్ (పెదతుంబలం), సనాతన రంగాచారి (ఎమ్మిగనూరు పట్టణం).

**పరారీలో ఉన్నవారు:**

ప్రధాన నిందితుడు ఆదోనికి చెందిన శివమూర్తితో పాటు సిరుగుప్పకు చెందిన పీరా పరారీలో ఉన్నారు. వీరి కోసం పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. శివమూర్తి ఈ బెట్టింగ్ నెట్‌వర్క్‌కు ప్రధాన సూత్రధారిగా వ్యవహరిస్తున్నట్లు విచారణలో తేలింది.

**డీఎస్పీ హెచ్చరిక:**

ఈ సందర్భంగా డీఎస్పీ భార్గవి మాట్లాడుతూ, క్రికెట్‌ను కేవలం వినోదంగా మాత్రమే చూడాలని, త్వరగా డబ్బు సంపాదించాలనే దురాశతో యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌ల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

"ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకుంటాం. అవసరమైతే రౌడీ షీట్లు కూడా ఓపెన్ చేస్తాం." అని డీఎస్పీ భార్గవి తెలిపారు. బెట్టింగ్‌కు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ఆమె కోరారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# రగులుకున్న 'డిలిమిటేషన్' చిచ్చు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లు రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. అయితే, దానిని డీఎంకే తన ప్రధాన ఎన్నికల అస్త్రంగా మలచుకుంటుండగా.. విపక్షాల మధ్య పొత్తులు, కొత్త పార్టీల ప్రభావంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**డిలిమిటేషన్ లొల్లి..**

ఎన్నికలకు కొద్ది రోజుల ముందు డీలిమిటేషన్ బిల్లును తీసుకురావడం వెనుక రాజకీయ వ్యూహం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన తమిళనాడు వంటి రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల పార్లమెంట్ స్థానాలు తగ్గి అన్యాయం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. డీఎంకే తన ప్రచారాన్ని 'రాష్ట్ర హక్కులు వర్సెస్ కేంద్ర పెత్తనం' అనే దిశగా నడిపిస్తోంది. కేంద్రం నిధులు ఇవ్వడం లేదని, ప్రాజెక్టుల్లో వివక్ష చూపుతోందని ఆరోపిస్తూ తమిళ సెంటిమెంట్‌ను బలంగా వినియోగిస్తోంది.

**పొత్తులపై ప్రభావం..**

డీలిమిటేషన్ బిల్లుతో ఏఐఏడీఎంకే , బీజేపీ మధ్య సంబంధాలు ప్రస్తుతం సందిగ్ధంలో ఉన్నాయి. కేంద్రం నుంచి వచ్చే నిధులను పొత్తులతో ముడిపెట్టడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని కొందరు విమర్శిస్తున్నారు. అదేవిధంగా ప్రముఖ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం ఈ ఎన్నికల్లో ఎంతవరకు ప్రభావం చూపుతుందనేది చర్చనీయాంశంగా మారింది. క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ లేకపోవడం ఆ పార్టీకి పెద్ద మైనస్ అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మహిళా ఓటర్లపై సానుకూల ప్రభావం చూపుతుండగా.. ప్రతిపక్షాలు వీటిని కేవలం ఓట్ల కోసం ఇచ్చే 'ఉచితాలు'గా అభివర్ణిస్తున్నాయి.

# బీఆర్ఎస్‌లో వర్గపోరు!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కేసీఆర్ జగిత్యాల సభ వేళ మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ పర్యటన రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. దాదాపు ఏడాది తర్వాత బహిరంగ సభకు పార్టీ అధినేత వస్తున్న సమయంలో హరీశ్ రావు హుటాహుటీన హస్తిన బాట పట్టడం ఇటు బీఆర్ఎస్ శ్రేణులతో పాటు పొలిటికల్ కారిడార్‌లో రకరకాల ఊహాగానాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ లోని పరిణామాలపై కాంగ్రెస్ ఎటాక్ మొదలు పెట్టింది. హరీశ్ రావు ఢిల్లీ పర్యటనపై తాజాగా స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ బీఆర్ఎస్‌లో వర్గపోరు మొదలైందని ఆరోపించారు. హరీశ్ రావు ఢిల్లీ పర్యటన వెనుక ఆంతర్యం ఏంటో జగిత్యాల సభలో కేసీఆర్, కేటీఆర్ ప్రకటించాలన్నారు. ఇక మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రియాక్ట్ అవుతూ హరీశ్ రావు రాజకీయ జీవితం ప్రమాదంలో ఉందని కామెంట్ చేశారు.

**బీజేపీ వైపు హరీశ్ రావు చూపు!:**

ఈ అంశంపై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ స్పందిస్తూ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. జీవన్ రెడ్డి రాకతో బీఆర్ఎస్‌లో ముసలం మొదలైందని హరీశ్ రావుతో పాటు బీజేపీ వైపు ఎమ్మెల్యేలు చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఢిల్లీ వెళ్లిందే బీజేపీ నేతలను కలవడానికి అని హాట్ కామెంట్స్ చేశారు. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాల దృష్ట్యా హరీశ్ రావు త్వరలో బీజేపీ గూటికి చేరబోతున్నారని చాలా కాలంగా ప్రచారం జరుగుతున్న వేళ సంజయ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి.

**బీఆర్ఎస్ రియాక్ట్:**

అయితే హరీశ్ రావు పర్యటనపై బీఆర్ఎస్ స్పందించింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకే పార్టీ త్రిసభ్య కమిటీ ఢిల్లీ పర్యటనకు వెళ్లిందని ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రతినిధుల బృందంలో హరీశ్ రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఉన్నారని ఏప్రిల్ 22వ తేదీన తెలంగాణ హైకోర్టులో కాళేశ్వరం కమిషన్‌పై వెలువడనున్న తుది తీర్పు, అలాగే ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసుల నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన కార్యాచరణను సిద్ధం చేసేందుకు వీరు ఢిల్లీ వెళ్లారని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో ఈ కమిటీ ప్రత్యేకంగా సమావేశమైందని కాళేశ్వరం కమిషన్ పై హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలపై, అలాగే ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో న్యాయపరంగా తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై లాయర్లతో చర్చించనున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది.

# జీవన్ రెడ్డి రావడం.. హరీశ్ రావుకు ఇష్టం లేదు

**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ పార్టీలోని నేతలపై స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో ముసలం మొదలైందన్నారు. ఈ రోజు జగిత్యాల వేదికగా జరుగుతున్న బీఆర్ఎస్ సభకు ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్ రావు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ సభ జగిత్యాలలో జరుగుతుంటే.. హరీశ్ రావుకు ఢిల్లీకి ఏం పని అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి రావడం.. హరీశ్ రావుకు ఇష్టం లేదన్నారు. జీవన్ రెడ్డి ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ ఎదగదన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్ రావులను ఉరి తీయాలని జీవన్ రెడ్డి అనలేదా? అని ప్రశ్నించారు. హరీశ్ రావుతో బీఆర్ఎస్‌లోని పలువురు ఎమ్మెల్యేలు మంతనాలు జరిపారని విమర్శించారు. తెలంగాణ వద్దన్న జీవన్ రెడ్డిని పార్టీలోకి ఎలా తీసుకుంటారంటూ బీఆర్ఎస్ నేతలను పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సూటిగా ప్రశ్నించారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా.. తనకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని జీవన్ రెడ్డి చాలా కాలంగా తీవ్ర ఆవేదనతో ఉన్నారు. ఇటీవల ఆయన ఆ పార్టీకి రాజీనామా చేశారు. బీఆర్ఎస్‌లోకి రావాలంటూ ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. స్వయంగా జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆహ్వానించారు. అనంతరం ఎర్రవెల్లిలోని ఫాం హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో జీవన్ రెడ్డి సమావేశమయ్యారు. ఆ పార్టీలో చేరేందుకు జీవన్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ఏప్రిల్ 20వ తేదీన జగిత్యాల సభలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆధ్వర్యంలో జీవన్ రెడ్డి కండువా కప్పుకోనున్నారు. ఈ నేపథ్యంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై విధంగా స్పందించారు.



**బీఆర్ఎస్ భవిష్యత్ అంధకారంలో ఉంది: ఎంపీ చామల**

టి.జీవన్ రెడ్డి పార్టీలో చేరడం బీఆర్ఎస్ నేతలకు ఇష్టం లేదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిఅన్నారు. జీవన్ రెడ్డిని ఎప్పుడూ హరీశ్ రావు పార్టీలోకి ఆహ్వానించలేదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏడాది తర్వాత బయటకు వస్తుంటే హరీశ్ రావు ఢిల్లీ వెళ్లారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్ అంధకారంలో ఉందన్నారు. హరీశ్ రావు ఢిల్లీలో ఎవరిని కలిశారో త్వరలో బయటకు వస్తుందని పేర్కొన్నారు. హరీశ్ రావు భవిష్యత్ ప్రణాళిక ఏమిటో ప్రజలకు తెలుసునని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చెప్పారు.

**బీఆర్ఎస్ పార్టీ రెండుగా చీలిపోయేలా కనిపిస్తోంది: మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

బీఆర్ఎస్ పార్టీలో వర్గపోరు మొదలైందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు. ఏడాది తర్వాత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫాం హౌస్ నుంచి బయటకొస్తున్నారన్నారు. హరీశ్ రావు జగిత్యాలకు రాకుండా ఢిల్లీ ఎందుకు వెళ్లారు? అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఏ పార్టీ నేతలను హరీశ్ రావు కలుస్తున్నారో త్వరలోనే బయటకొస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ రెండుగా చీలిపోయేలా కనిపిస్తోందంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ జోస్యం చెప్పారు.



# తెలంగాణ జాగృతిలో మరో కీలక నేత చేరిక..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించడానికి ముహూర్తం ఖరారు చేయడంతో, రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాల నేతలు ఆమె వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా తెలంగాణ జాగృతిలోకి మరికొంతమంది కీలక నేతలు చేరారు. తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ సహకార సంఘం అధ్యక్షుడు తాటికొండ శ్రీనివాసచారి తన అనుచరులతో కలిసి సోమవారం తెలంగాణ జాగృతిలో చేరారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో కల్వకుంట్ల కవిత వారికి గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సామాజిక వర్గాల ఆశయాల సాధనే లక్ష్యంగా తమ ప్రయాణం సాగుతుందని పేర్కొన్నారు.

**ఏప్రిల్ 25న పార్టీ ప్రకటన..**

వచ్చే ఏప్రిల్ 25న మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరగనున్న భారీ బహిరంగ సభలో కవిత తన కొత్త రాజకీయ పార్టీ పేరు, జెండా, విధివిధానాలను ప్రకటించనున్నారు. పార్టీ ఆవిర్భావానికి సమయం దగ్గర పడుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా చేరికలు ఊపందుకున్నాయి. ఇటీవల బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కూడా జాగృతిలో చేరి పార్టీ బలోపేతానికి కట్టుబడి ఉంటానని ప్రకటించారు. కొత్త పార్టీలో యువతకు, మహిళలకు పెద్దపీట వేయబోతున్నట్లు కవిత ఇప్పటికే స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీ అవసరం ఉందని, ఆ లోటును జాగృతి భర్తీ చేస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ చేరికలతో తెలంగాణ రాజకీయాల్లో కవిత కొత్త పార్టీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఏప్రిల్ 25న జరగబోయే సభ ద్వారా తన రాజకీయ వ్యూహాన్ని ఆమె ఎలా ఆవిష్కరిస్తారో వేచి చూడాలి.

# పనులు నాణ్యతతో, నిర్ణీత కాలంలో పూర్తి చేయాలి..



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** నగర అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 44వ డివిజన్‌లో కోటి 50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ.... 44వ డివిజన్ లో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు దీర్ఘకాల ప్రయోజనం చేకూరేలా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు నిర్ణీత కాలంలో పూర్తయ్యేలా కాంట్రాక్టర్లు కట్టుబడి ఉండాలని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పనులను పర్యవేక్షిస్తూ నాణ్యత కాపాడాలని సూచించారు. ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పూనుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్, ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# రీ-డిజైన్ పేరుతో భారీ దోపిడీ..

**జయశంకర్ భూపాలపల్లి,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ నుంచి తప్పించుకునేందుకే మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీకి పరుగెత్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. జడ్జిమెంట్ ప్రకటించకముందే న్యాయవాదులను కలవాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆరోపించారు. సోమవారం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి కుంగిన పిల్లర్లను పరిశీలించిన అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. బీజేపీని అడ్డుపెట్టుకుని కేసుల నుంచి బయటపడతామంటే రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, కాళేశ్వరం దోషులను కఠినంగా శిక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు.

**లక్షన్నర కోట్లకు అంచనాల పెంపు**

గోదావరి జలాలతో ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు 1975లో అప్పటి సీఎం జలగం వెంగళరావు మహారాష్ట్రతో ఒప్పందం చేసుకున్నారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఆ తర్వాత 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి రూ. 38,063 కోట్లతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించి రూ. 11,700 కోట్లు ఖర్చు చేశారన్నారు. అయితే, ప్రాణహిత-చేవెళ్ల ద్వారా ఆర్థిక, రాజకీయ ప్రయోజనం లేదన్న ఉద్దేశంతోనే కేసీఆర్ రీడిజైనింగ్ పేరుతో దానికి పేరు, ఊరు మార్చేశారని విమర్శించారు. అంచనాలను ఏకంగా రూ. లక్షా 50 వేల కోట్లకు పెంచారని మండిపడ్డారు. 2016లో మొదలుపెట్టిన మేడిగడ్డను అద్భుతమని భ్రమలు కల్పించి 2018లో రాజకీయ లబ్ధి పొందారని, తీరా 2023లో బ్యారేజీ కుప్పకూలడంతో ఎన్నికల కోసం ఆ నిజాలను దాచిపెట్టాలని చూసినా ప్రకృతి బయటపెట్టిందని ఎద్దేవా చేశారు.

**కేంద్రం ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం**

ప్రాజెక్టులో సమస్యలు రాగానే 2023 నవంబర్ 1న అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి ఎన్డీఎస్ఏ ప్రాథమిక నివేదిక ఇచ్చినా పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం దోపిడీపై పీసీ ఘోష్ కమిటీ సంపూర్ణ నివేదిక ఇచ్చిందని, దీనిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తీర్మానం పంపిందని తెలిపారు. కేసీఆర్, హరీశ్ రావులను జైల్లో వేయాలని, సీబీఐకి కేసు అప్పగించాలని గతంలో డిమాండ్ చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని సీఎం ప్రశ్నించారు. రాష్ట్రం పదే పదే లేఖలు రాస్తున్నా సీబీఐ స్పందించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేకపోయారని ముఖ్యమంత్రి విమర్శించారు. ఈ ప్రాజెక్టుకు శ్రీపాద ఎల్లంపల్లే ప్రాణవాయువు అని, హరీశ్ రావు నిక్కర్ వేసుకోకముందే ఆ ప్రాజెక్టు ఉందని ఎద్దేవా చేశారు. ఎల్లంపల్లి నీటితోనే రాష్ట్రంలో అత్యధిక పంటలు పండించారని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై విచారణకు ఆదేశిస్తారని ముందే తెలిసి, బీజేపీ నేతల కాళ్లు పట్టుకునేందుకు హరీశ్ రావు ఢిల్లీకి వెళ్లారని ఆరోపించారు. మీడియా బయటపెట్టినా వారి నుంచి ఎలాంటి ప్రకటన లేదని, ఆ రహస్య పర్యటన వెనుక ఉన్న మతలబు ఏంటో, ఎవరెవరిని కలిశారో తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

**వృథాగా వదలం.. రిపేర్లు చేసి తీరుతాం**

లక్షల కోట్ల ప్రజాధనం వెచ్చించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఊరికే వదిలిపెట్టబోమని, దానికి మరమ్మతులు చేసి ప్రజలకు నీరు అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందుకు సంబంధించి నెల రోజుల క్రితమే అధికారులతో, సాంకేతిక నిపుణులతో సమావేశాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. అయితే, ప్రాజెక్టుకు సంబంధించిన నిజాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతోనే బీఆర్ఎస్ నేతలు ఉద్దేశపూర్వకంగా నేడు రాజకీయ సభలు పెట్టుకున్నారని, అయినా రాష్ట్ర ప్రభుత్వం వారికి అనుమతులు ఇచ్చిందని సీఎం పేర్కొన్నారు. అవసరమైన ప్రణాళికలతో ముందుకు వెళతామని, తప్పు చేసిన వారిని చట్టపరంగా శిక్షించి తీరుతామని ఆయన తేల్చి చెప్పారు.

**అతితెలివి రాజకీయాలు..**

తాము నెల రోజుల ముందే మేడిగడ్డ పర్యటన ఖరారు చేసుకున్నామని.. తమ బండారం బయటపడుతుందనే భయంతోనే కేసీఆర్ నేడు కావాలనే రాజకీయ సభ పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం అవినీతిపై కేంద్రం ఎక్కడ విచారణకు ఆదేశిస్తుందో అనే భయంతో హరీష్ రావు బీజేపీ కాళ్లు పట్టుకోవడానికి ఢిల్లీ వెళ్లారని సీఎం సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్, హరీష్ రావులను జైల్లో పెడతామని గతంలో బీజేపీ నేతలు ప్రగల్భాలు పలికారని.. కానీ తాము రెండుసార్లు సీబీఐకి లేఖలు రాసినా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టు పునరుద్ధరణపై తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తాము ఇప్పటికే సాంకేతిక నిపుణులు మరియు మూడు నిర్మాణ సంస్థల ప్రతినిధులతో చర్చించామని, శాస్త్రీయ పద్ధతిలో మరమ్మతులు మొదలుపెట్టామని వెల్లడించారు. ఈ పర్యటనలో మంత్రులు, ఇరిగేషన్ నిపుణులు పాల్గొని బ్యారేజీ స్థితిగతులను నిశితంగా పరిశీలించారు.

# బీఆర్ఎస్‌లో చేరిన జీవన్ రెడ్డి..



**కరీంనగర్ ,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో కీలక మార్పు చోటుచేసుకుంది. సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి అధికారికంగా బీఆర్ఎస్ గూటికి చేరారు. జగిత్యాలలో నిర్వహించిన భారీ 'ప్రజా ఆశీర్వాద సభ' వేదికగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.జగిత్యాల పార్టీ కార్యాలయం నుండి కేసీఆర్ భారీ కాన్వాయ్‌తో సభా ప్రాంగణానికి బయలుదేరారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న అభిమానులకు, పార్టీ కార్యకర్తలకు అభివాదం చేస్తూ ఆయన వేదిక వద్దకు చేరుకున్నారు. స్టేజ్ పైకి రాగానే కేసీఆర్ తనదైన శైలిలో ప్రజలకు అభివాదం చేయడంతో సభా ప్రాంగణం అంతా జై తెలంగాణ నినాదాలతో మారుమోగిపోయింది.నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్‌లో ఉన్న జీవన్ రెడ్డి, కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరడం జిల్లా రాజకీయాల్లో పెను మార్పుగా భావిస్తున్నారు. జీవన్ రెడ్డి అనుభవం పార్టీకి ఎంతో బలాన్ని ఇస్తుందని, జగిత్యాల నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ మరింత పటిష్టం అవుతుందని కేసీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కీలకమైన సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. అయితే, దీనికి గల కారణాన్ని పార్టీ వర్గాలు వెల్లడించాయి. నిన్న జరిగిన జగిత్యాల పర్యటనలో భాగంగా తీవ్రమైన ఎండల వల్ల కేటీఆర్ వడదెబ్బకు గురయ్యారు.ప్రస్తుతం ఆయన వైద్యుల సలహా మేరకు విశ్రాంతి తీసుకుంటుండటంతో నేటి సభకు రాలేకపోయినట్లు సమాచారం. వేదికపై నుండి కేసీఆర్ ప్రజలకు , కార్యకర్తలకు ప్రత్యేకంగా అభివాదం చేస్తూ ఉత్సాహపరిచారు. జీవన్ రెడ్డి చేరిక నేపథ్యంలో జగిత్యాల నియోజకవర్గం నలుమూలల నుండి భారీగా జనం తరలివచ్చారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో సీనియర్ నేతలను కలుపుకుపోవడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని కేసీఆర్ సంకేతాలిచ్చారు.

**జీవన్ రెడ్డికి బీఆర్ఎస్‌లో కీలక పదవి..**

సీనియర్ నేత టీ.జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరడంపై అధినేత కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. జగిత్యాలలో జరిగిన భారీ బహిరంగ సభలో జీవన్ రెడ్డికి కండువా కప్పి ఆహ్వానించిన అనంతరం కేసీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యక్తిత్వాన్ని, ఆయనతో ఉన్న అనుబంధాన్ని కేసీఆర్ కొనియాడారు. జీవన్ రెడ్డి నిర్ణయాన్ని కేసీఆర్ "గుండె ధైర్యంతో కూడిన నిర్ణయం"గా అభివర్ణించారు. వ్యక్తిగత లాభం కంటే తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని భావించి జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి వచ్చారని కేసీఆర్ పేర్కొన్నారు. ఆయన ప్రజా జీవితం ఎంతో మంది రాజకీయ నాయకులకు ఆదర్శమని, ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరవలేనిదని కొనియాడారు. "మేమిద్దరం 45 ఏళ్లుగా స్నేహితులం. గతంలో రాజకీయంగా విభిన్న ధృవాల్లో ఉన్నా, మా మధ్య స్నేహం మాత్రం అలాగే ఉంది. రాజకీయ విభేదాలు ఉన్నా ఎప్పుడూ కలిసే ఉన్నాం" అని కేసీఆర్ భావోద్వేగంగా మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా జీవన్ రెడ్డి ఇకనుంచి రాష్ట్రం మొత్తంలో బీఆర్ఎస్‌కు పనిచేయబోతున్నారని కేసీఆర్ సంచలన ప్రకటన చేశారు.

**కరీంనగర్ జిల్లాలో తిరుగులేని బలం..**

జీవన్ రెడ్డి చేరికతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ కేడర్‌లో కొత్త ఉత్సాహం వచ్చిందని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. జీవన్ రెడ్డికి కేవలం జిల్లాలోనే కాకుండా మొత్తం తెలంగాణ రాజకీయాల మీద మంచి అవగాహన, పట్టు ఉన్నాయని ప్రశంసించారు. ఆయనకున్న అశేష కేడర్, అనుభవంతో రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని కేసీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే, మరోవైపు జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేతను పక్కన చేర్చుకోవడం ద్వారా కేసీఆర్ తన రాజకీయ వ్యూహాన్ని జగిత్యాల గడ్డపై మరోసారి ప్రదర్శించారు.

**కాంగ్రెస్‌లో క్షోభ భరించలేకే బీఆర్ఎస్‌లోకి..**

సీనియర్ రాజకీయ నేత జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి, కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. జగిత్యాలలో జరిగిన 'ప్రజా ఆశీర్వాద సభ'లో కేసీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రయాణం ఒక మలుపు తిరిగిందని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ కోసం పనిచేసిన తనకు గత 20 నెలలుగా తీవ్ర మానసిక క్షోభ, వివక్ష మాత్రమే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీవిత చరమాంకంలో ఈ అవమానాలు భరించలేక, రాష్ట్రానికి పట్టిన శని వదలాలనే ఉద్దేశంతోనే తాను పార్టీ మారాను తప్ప.. పదవులను ఆశించి కాదని స్పష్టం చేశారు.

**రేవంత్ సర్కార్‌పై విమర్శలు**

మేడిగడ్డలో పిల్లర్లు కుంగితే రిపేర్ చేయకుండా రాద్ధాంతం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. నిర్మాణ దశలో ఉన్న ఎస్ఎల్‌బీసీ కూలి 8 మంది చనిపోతే కనీసం మృతదేహాలను కూడా బయటకు తీయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధును ఎగ్గొట్టడంతో పాటు, తులం బంగారం ఇస్తామన్న నెపంతో ఉన్న కల్యాణలక్ష్మి పథకాన్ని కూడా అటకెక్కించిందని మండిపడ్డారు. విద్యార్థి దశ నుంచే కేసీఆర్‌తో తనకు అనుబంధం ఉందని, ఈ కష్టకాలంలో ఆయన తనకు అండగా నిలిచారని జీవన్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. కేవలం కేసీఆర్ దూరదృష్టితోనే జగిత్యాల జిల్లాగా ఏర్పడిందని, మెడికల్ కాలేజీ, బోర్నపల్లి బ్రిడ్జి, గురుకుల పాఠశాలలు అందుబాటులోకి వచ్చాయని కొనియాడారు. గిరిజనులకు రిజర్వేషన్లు పెంచిన ఘనత కూడా కేసీఆర్‌దేనని ప్రశంసించారు.

**నువ్వు వెయ్యి జన్మలు ఎత్తినా నేను చావను నా కొడకా**

"తెలంగాణ గడ్డపై గంజి కేంద్రాలు నడిచిన రోజులు చూశాం.. కరెంట్ కోసం బషీర్‌బాగ్‌లో మన పిల్లలు ప్రాణాలిస్తుంటే చలించి ఉద్యమానికి వచ్చాను.. నన్ను బాడీ షేమింగ్ చేసినా, హేళన చేసినా పక్షిలా రాష్ట్రమంతా తిరిగి తెలంగాణ సాధించాను" అంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావోద్వేగ ప్రసంగం చేశారు. సోమవారం జగిత్యాలలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తెలంగాణ రాకముందున్న దుస్థితిని కేసీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. పాలమూరు నుంచి 90 శాతం వలసలు ఉండేవని, తిండి లేక, పని లేక ప్రజలు దేశాలు దాటి వెళ్లేవారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు హయాంలో కరెంట్ ఛార్జీలు పెంచితే నిరసన తెలిపిన వారిని కాల్చి చంపిన ఘటన తనను ఉద్యమం వైపు నడిపించిందని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇంటింటికీ మంచినీళ్లు, 24 గంటల కరెంట్ ఇచ్చి తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టామని గర్వంగా ప్రకటించారు.

**పాలన గాలికి.. కేసీఆర్ చావే లక్ష్యమా?**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తులం బంగారం, స్కూటీలు, పెంచిన పెన్షన్లు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతుబంధు, దళితబంధులను గాలికి వదిలేసి రైతులను, పేదలను ఏడిపిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పెద్దలు పాలన వదిలేసి కేసీఆర్ చావాలి అని కోరుకుంటున్నారు. వెయ్యి జన్మలెత్తినా నేను చావను నా కొడకా.. అంటూ అత్యంత ఘాటుగా స్పందించారు. అభివృద్ధి ముచ్చట లేదని, కేవలం పాలకుల చిల్లర మాటలు తప్ప రాష్ట్రంలో ఏమీ జరగడం లేదని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. "మొన్న కేవలం 1.7 శాతం ఓట్లతోనే ఓడిపోయాం. ప్రజలు ఇప్పుడిప్పుడే కాంగ్రెస్ నైజాన్ని గ్రహిస్తున్నారు. మళ్లీ బరాబర్ మనమే అధికారంలోకి వస్తాం.. ఈసారి బంపర్ మెజార్టీతో వస్తాం" అని కేడర్‌లో ఉత్సాహం నింపారు. ఈ సభలో సీనియర్ నేత టీ. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు.

# సంపాదకీయం

# అధికారులు గప్ చుప్..!

'దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్టు.. ' తెలుగులో ఓ సామెత ఉంది. అచ్చం ఇది సింగరేణి సంస్థలోని ఓ విభాగంలో కొంతమంది పై స్థాయి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ఇది పక్కాగా వర్తిస్తుందని కార్మికులు ఆరోపిస్తున్నారు. సింగరేణి సంస్థ ఆస్తులకు కాపాలదారులుగా ఉండాల్సిన అధికారులే కిందిస్థాయి అధికారులతో చేతులు కలిపి సంస్థ సొమ్మును అప్పనంగా దోచుకుంటూ జేబులు నింపుకుంటున్నారు.ఎండనక వాననక సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం కోసం కార్మికులు రేయింబవళ్ళు కార్మికుల రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడుతుంటే వారి కష్టాన్ని ఫ్యాన్లో, ఏసీలలో కూర్చున్న కొంత మంది అధికారులు నీళ్ళపాలు చేస్తున్నారు. సంస్థ ఆస్తులను అక్రమంగా దోచుకోవడమే లక్ష్యంగా ఒక పథకం ప్రకారం మెయిన్ వర్క్ షాప్ లోని కొంతమంది అధికారులు రింగై బ్రిటీష్ కాలం నాటి కాపర్ వైర్ ను మాయం చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై సింగరేణి చీఫ్ విజిలెన్స్ ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేస్తే ఎన్నో సంచలన విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉందంటున్నారు కార్మికులు.

**పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు పంపకాలే..**

2023లో గాలి దుమారం రావడంతో ఎన్పీడీసీఎల్ పవర్ లైన్ తొలగిస్తుండగా పక్కనే ఉన్న సింగరేణి లైన్ పై పడడంతో భజన మందిరం నుంచి క్రాస్ రోడ్ సమీపాన ఉన్న బంగ్లోస్ వరకు బ్రిటిష్ కాలం నాటి కాపర్ వైర్ కాలిపోయింది. బ్రిటీష్ కాలం నాటి ఐదులైన్ల కాపర్ వైర్ ను ఆ సమయంలో తొలగించగా సుమారు నాలుగు నుంచి ఐదు టన్నుల వరకు కాపర్ వైర్ ను సింగరేణి సెంట్రల్ స్టోర్ కు అప్పగించలేదు. కాపర్ వైర్ ను స్క్రాప్ రూపంలో అమ్ముకొని కోట్ల రూపాయలను సొమ్ము చేసుకున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై ఇప్పటికే దిశ పలు కథనాలను ప్రచురించింది. అయితే ఇందులో అనేకమంది కీలకపాత్ర పోషించడం వల్లనే ఈ కాపర్ వైర్ మాయం కథ మరుగున పడిపోయిందని అందుకే అధికారులెవరు ఈ అంశాన్ని పెద్దగా పట్టించుకోలేదన్నది కార్మికుల వాదన.కానీ ఇందులో ఈ అండ్ ఎం విభాగంలో పనిచేసి రిటైర్డ్ అయిన ఓ మాజీ డైరెక్టర్, ప్రస్తుతం విజిలెన్స్ విభాగంలో ఉన్న ఓ ఉన్నతాధికారి, ఓ డీవైఎస్ఈ స్థాయి అధికారి, ఓ ఫోర్ మెన్ లు అంతా కలిసి రింగవడం, వాటిని పక్కదారి పట్టించే భారీగా వాటాలు వేసుకొని, సొమ్ము చేసుకున్నారనే విషయాలు ప్రస్తుతం ప్రాచుర్యంలోకి వస్తున్నాయి. ఆ మాజీ డైరెక్టర్ డైరెక్షన్లోనే వీరంతా కలిసి కాపర్ వైర్ ను ధైర్యంగా మాయం చేసి సొమ్ము చేసుకోవడం ఆ తర్వాత ఏమి తెలియనట్టుగా తమ పనులు చేసుకోవడం షరా మామూలుగానే జరుగుతున్నాయి. అందుకే చాలా ధైర్యంగా 'ఏమి జరగలేదు.. మాకేమీ కాదు' అన్నట్టుగా ప్రస్తుతం కాపర్ వైర్ ను మాయం చేసిన అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**కాపర్ మాయంపై గప్ చుప్ అయిన అధికారులు**

2023లో జరిగిన కాపర్ వైర్ మాయం చేసి సొమ్ము చేసుకున్న అధికారులు ఆ తర్వాత ఈ అంశంపై కార్మికులకు తెలిసినప్పటికీ పెద్దగా వెలుగులోకి రాలేదు. పై స్థాయి అధికారులు, కిందిస్థాయి అధికారులు కలిసి ఈ విధంగా సంస్థ ఆస్తులను అప్పనంగా దోచుకోవడం ఎంతవరకు సమంజసమని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. సంస్థకు కాపలాదారులు గా ఉండాల్సిన రక్షకులే భక్షకులుగా మారి ఈ విధంగా అక్రమ సొమ్ము కోసం అవినీతి బాట పట్టి గప్ చుప్ అవడంలో మతలబేంటో అర్థం కావడం లేదు. మెయిన్ వర్క్ షాప్ లో కార్మికులకు తెలిసే ఇన్ని జరుగుతుంటే ఇక కార్మికులకు తెలియకుండా ఇంకెన్ని జరుగుతున్నాయో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వర్క్ షాప్ లో కమిషన్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న అధికారి**

కార్పొరేట్ ఏరియాలోని వర్క్ షాప్ లో ఓ డీవైఎస్ఈ స్థాయి అధికారి కమిషన్ ఏజెంట్ గా వ్యవహరిస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. కార్పొరేట్ లోని కార్యాలయాలకు, అధికారుల నివాసాలకు, క్వార్టర్లకు అవసరమైన ఎలక్ట్రికల్ వస్తువుల కొనుగోలు, ఎలక్ట్రికల్ వస్తువులు రిపేర్లు అయిన పక్షంలో వాటికి మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. ఎలక్ట్రికల్ వస్తువులు బిగించడం, రిపేర్లు చేసేందుకు అందుబాటులో ఉన్న కాంట్రాక్టర్ ను తన చెప్పుచేతల్లో ఉంచుకోవడం ఈ అధికారికి ఆనవాయితీగా మారింది.కాంట్రాక్టర్ ఏ షాపులో ఎలక్ట్రికల్ వస్తువులు కొనుగోలు చేయాలో ఆ అధికారే ఆదేశిస్తూ అటు ఎలక్ట్రికల్ షాపులో, ఇటు కాంట్రాక్టర్ దగ్గర నుంచి పెద్ద స్థాయిలో కమిషన్ పొందుతారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిషన్ లేకుంటే కునుకే పట్టదన్నట్లుగా వ్యవహరించడం ఇతని నైజంగా మారింది. ఆ అధికారిని కాదని కాంట్రాక్టర్ ఇతర షాపుల్లో ఎలక్ట్రికల్ వస్తువులను కొనుగోలు చేస్తే కాంట్రాక్టర్ ను ఇబ్బందులు పెట్టి విసిగించడం ఇతనికి సర్వసాధారణంగా మారిపోయింది. ఆయన వేధింపులకు భయపడి కాంట్రాక్టర్లు చేసేదేమీ లేక ఆయన చెప్పినట్లే చేయడానికి అలవాటుపడ్డారు. గత కొన్నేళ్ళుగా కాంట్రాక్టర్ కు చెల్లించిన బిల్లులు, షాపుల నుంచి కొనుగోలు చేసిన వస్తువుల రేటును విచారణ చేస్తే ఇతని కమిషన్ గుట్టు రట్టు అవడం ఖాయమమంటున్నారు కార్మికులు.

**విజిలెన్స్ ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే అవినీతి గుట్టురట్టు అవడం ఖాయం**

విజిలెన్స్ విభాగంలో ఉన్న కీలక అధికారిని తప్పించి నిష్పక్షపాతంగా విచారణ చేస్తే ఖచ్చితంగా కాపర్ వైర్ మాయం, సొమ్ము చేసుకోవడం పై, డీవైఎస్ఈ స్థాయి అధికారి కమిషన్లు తదితర అంశాలను బయటకు వస్తాయని కార్మికులు పేర్కొంటున్నారు. సంస్థలోని లొసుగులను అడ్డుపెట్టుకుని వర్క్ షాప్ లోని కొంతమంది అధికారులంతా ఏకమైన సంస్థ సొమ్మును పక్కదారి పట్టించడం మామూలు విషయం కానే కాదు. ఇంత జరిగిన తమకేమీ తెలియదన్నట్లుగా వ్యవహరించడం, ఏమైనా, ఎవరైనా సరే మేనేజ్ చేయగలమనే ధీమాలో ఉన్న అధికారుల గుట్టు రట్టు చేసి సంస్థ పై కార్మికులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిష్పక్షపాతంగా విచారణ చేస్తారా..? లేక తూ..తూ.. మంత్రంగా విచారణ జరిపి అక్రమార్కులను వదిలివేస్తారా.. అనేది విజిలెన్స్ ఉన్నతాధికారుల చేతుల్లోనే ఉంది.

**అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి**

వర్క్ షాప్ లో కాపర్ వైర్ మాయం పై విజిలెన్స్ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేయాలి. అవినీతికి పాల్పడిన ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలి. ఎస్ టీ పీ పీ లో కూడా విలువైన కాపర్ ను కూడా స్క్రాప్ రూపంలో అమ్మారు. విజిలెన్స్ ఉన్నతాధికారులు నచ్చిన వాళ్ళకి ఒకలాగా, నచ్చని వారికి ఇంకోలాగా వ్యవహరిస్తున్నారు. అధికారులు అవినీతి కి పాల్పడితే వారిపై చర్యలు తీసుకోకుండా కాంట్రాక్ట్ ఉద్యోగులను బలి చేస్తున్నారు. ఈ విధానం మారాలి. కాపర్ వైర్ మాయం లో అధికారుల పాత్ర ఏంటో తేల్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. వస్తువుల కొనుగోళ్ల విషయంలో కూడా స్పష్టమైన విచారణ చేయాలని కోరారు.




# ఇది కుట్రపూరిత డీలిమిటేషన్!



భిన్నత్వంలో ఏకత్వ సంస్కృతి వారసత్వంతో ప్రపంచవ్యాప్తంగా భారతదేశం కీర్తించబడుతుంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా రాష్ట్రాల మధ్య, దేశ ప్రజల మధ్య చిచ్చు పెడుతోంది. ఇంతకాలం అధికారాన్ని అడ్డం పెట్టుకొని స్వయం ప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్, ఐటీ, ఈడీ సంస్థలను దుర్వినియోగపరచిన నరేంద్ర మోదీ సర్కారు ఇప్పుడు మరో అడుగు ముందుకేసి మహిళలకు 33శాతం రిజర్వేషన్ బిల్లును అడ్డుపెట్టుకొని అశాస్త్రీయంగా నియోజకవర్గాల పునర్విభజన చేసేందుకు సిద్ధమైంది.దేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును కాంగ్రెస్‌తో సహా ఏ ఇతర పార్టీలూ వ్యతిరేకించడం లేదు. అయితే ఈ బిల్లును అడ్డం పెట్టుకొని దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన పేరిట బీజేపీ కుట్రలకు తెరదీసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వీటిపై సమగ్రంగా చర్చించి స్పష్టమైన వైఖరిని ప్రకటించింది. మహిళల సాధికారతకు కట్టుబడిన కాంగ్రెస్ పార్టీ డీలిమిటేషన్ విషయంలో మాత్రం దేశ సమగ్రతను, సమతౌల్యాన్ని కాపాడాలని కోరుతోంది.2024 లోక్‌సభ ఎన్నికల ముందు 2023లో మహిళా రిజర్వేషన్ చట్టాన్ని చేసి చేతులు దులుపుకుంది బీజేపీ. మహిళా రిజర్వేషన్లను 2024 ఎన్నికల నుంచే అమలు చేయాలని కాంగ్రెస్ కోరినప్పటికీ పెడచెవిన పెట్టింది. 2026 జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన చేసి అనంతరం మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని కప్పదాటు వైఖరిని ప్రదర్శించింది. 2021లో చేయాల్సిన జనగణనను కోవిడ్ కారణంగా వాయిదా వేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ తాత్సారం చేసింది. ఇప్పుడు హడావిడిగా జనాభా లెక్కలు తేలకముందే 50శాతం పెంపుతో నియోజకవర్గాల పునర్విభజన చేస్తున్నట్టు ప్రకటించింది. ఇందులో కుట్ర దాగి ఉంది. అది బయటపడకుండా మహిళా రిజర్వేషన్లకు లింకు పెట్టి పొలిటికల్ గేమ్ ప్రారంభించింది.ఉత్తరాది హిందీ బెల్ట్ పార్టీగా గుర్తింపు పొందిన బీజేపీ ప్రభుత్వం 50శాతం సీట్ల పెంపు ప్రతిపాదనతో డీలిమిటేషన్ చేసి దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. దేశంలో లోక్‌సభ స్థానాలను 543 నుంచి 850కు పెంచాలని నిర్ణయించింది. ఉదాహరణకు ప్రస్తుతం 20 లోక్‌సభ స్థానాలున్న కేరళకు, 80 స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌కు మధ్య సీట్ల వ్యత్యాసం 60 లోక్‌సభ స్థానాలు. ప్రస్తుతం ప్రతిపాదించినట్టు యాభై శాతం ప్రకారమైతే కేరళకు 30, యూపీకి 120 సీట్లు వస్తాయి. అంటే రెండు రాష్ట్రాల మధ్య వ్యత్యాసం 90 స్థానాలుగా ఉంటుంది. మొత్తం మీద దక్షిణాదిలో 130 నుంచి 195 స్థానాలయితే, ఉత్తరాదిలో 413 నుంచి 621 స్థానాలవుతాయి. రెండు ప్రాంతాల మధ్య అంతరం భారీ స్థాయిలో ఉండి, దేశంలో ఉత్తరాది ప్రాంతాల ఆధిపత్యం పెరుగుతుంది. ఇప్పటికే దక్షిణాదిపై చిన్న చూపుతో ఉన్న బీజేపీ మరింత వివక్ష చూపించే అవకాశాలు పెరుగుతాయి. కేవలం దక్షిణాది ప్రాంతాలే గాక, దేశంలోని చిన్న రాష్ట్రాలన్నీ ఈ నిర్ణయంతో తీవ్రంగా నష్టపోతాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో అధిక స్థానాలు గెలిచి అన్ని రాష్ట్రాలపై పెత్తనం చలాయించేందుకు నియోజకవర్గాల డీలిమిటేషన్‌ను బీజేపీ అస్త్రంగా చేసుకుంటుంది.దేశంలో పదేళ్లకోసారి జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయాలని స్వాతంత్ర్యానంతరం పునర్విభజన కమిషన్ల ఏర్పాటు ప్రతిపాదనలు తీసుకొచ్చారు. అందుకు తగ్గట్టు 1951, 1962, 1972లో కమిషన్లు ఏర్పాటు చేసి లోక్‌సభ స్థానాలను 494 నుంచి 522కు, అనంతరం 543కు పెంచారు. ఇదే సమయంలో జనాభా నియంత్రణ కోసం 1970లో నాటి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించడంలో దేశంలో జనాభా కట్టడి ఫలితాలిచ్చినా, ప్రాంతాల మధ్య సమతుల్యం దెబ్బతిన్నది. యూపీ, బిహార్ వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా కట్టడి విఫలమవగా, దక్షిణాది రాష్ట్రాలన్నీ జనాభా నియంత్రణలో సఫలమైనాయి. అయితే ఇప్పుడు అదే అంశం దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా మారడం విచారకరం. జనాభాపరంగా ఉత్తరాది రాష్ట్రాల సీట్లు పెరిగి, దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశాలుండడంతో– – నాటి ప్రధాని ఇందిరాగాంధీ ముందు చూపుతో 1976లో 42వ రాజ్యాంగ సవరణతోను, తర్వాత వాజపేయి ప్రభుత్వం 2002లో 84వ రాజ్యాంగ సవరణతోను జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పెంపును అడ్డుకున్నారు. కేవలం భౌగోళిక సరిహద్దుల మార్పుతోనే నియోజకవర్గాల పునర్విభజన చేశారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనతో దేశంలో సమతుల్యం దెబ్బతింటుందని గుర్తించిన ఇందిరాగాంధీ, వాజపేయి ప్రతిపాదనలను ఇప్పుడు మోదీ ప్రభుత్వం బుట్టదాఖలు చేస్తోంది.రాజకీయ సమానత్వం లేకుండా తొందరపాటు నిర్ణయంతో సంఖ్యాపరంగా దేశంలో నియోజకవర్గాల డీలిమిటేషన్ చేయాలన్న ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధం. దేశంలోని అన్ని రాష్ట్రాలతో, రాజకీయ పార్టీలతో, మేధావులతో, ప్రజాసంఘాలతో చర్చించకుండా హడావిడిగా గందరగోళంగా ఇంతటి కీలక నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరం. మహిళా రిజర్వేషన్ల బిల్లు కోసం ఏప్రిల్ 16 నుంచి ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్టు భారీగా ప్రచారం చేస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వం ఇదే ముసుగులో డీలిమిటేషన్ కుట్రకు పాల్పడుతోంది. ఒకపక్క కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుంటే ఈ రెండు బిల్లులను తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధం. కనీసం ఎన్నికలు ముగిసేవరకైనా వాయిదా వేయాలని కోరుతున్నా మోదీ ప్రభుత్వం మొండి వైఖరితో ముందుకెళ్లడంలో మోసపూరిత కుట్రలు దాగున్నాయి.మహిళలకు 33శాతం రిజర్వేషన్లపై కూడా బీజేపీది మొసలికన్నీరే. 2024 ఎన్నికల నుంచి అమలు చేయమని కోరితే పట్టించుకోలేదు. మహిళా రిజర్వేషన్లలో కాంగ్రెస్ పార్టీ పాత్ర చరిత్రాత్మకమైనది. 1990లోనే రాజీవ్‌గాంధీ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ చేసింది. పీవీ నరసింహారావు ప్రభుత్వం 73, 74 రాజ్యాంగ సవరణలు చేయడంతో ప్రస్తుతం గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో 14 లక్షలకు పైగా మహిళా ప్రతినిధులు ఎన్నికై సేవలందిస్తున్నారు. 2010లో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో మహిళా రిజర్వేషన్ బిల్లును రాజ్యసభ ఆమోదించడం చరిత్రాత్మకం. కాబట్టి, బిల్లు ప్రస్తుతం ఈ దశకు చేరుకుందంటే ఆ ఘనత కాంగ్రెస్ పార్టీదే. అయితే డీలిమిటేషన్‌పై బీజేపీ కుట్రలను కాంగ్రెస్ పార్టీ బట్టబయలు చేస్తుంటే మహిళా బిల్లును వ్యతిరేకిస్తున్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలు రెండూ వేర్వేరని కాంగ్రెస్ చెబుతున్న వాస్తవాలను ప్రజలు గ్రహించి బీజేపీకి తగిన సమయంలో తగిన బుద్ధి చెప్పడం ఖాయం.కాంగ్రెస్ పార్టీ మహిళా సాధికారిత కోసం మహిళలకు 33శాతం రిజర్వేషన్ల బిల్లుపై సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నది. అదే సమయంలో దేశంలో ప్రాంతాల మధ్య సమతుల్యత దెబ్బతినకుండా, అన్ని రాష్ట్రాలు సమాన స్థాయిలో అభివృద్ధి చెందేలా, పారదర్శకంగా నియోజకవర్గాల డీలిమిటేషన్ జరగాలని కోరుతున్నది. ఈ అంశంలో బీజేపీ నియంతృత్వ వైఖరిని అడ్డుకునేందుకు పోరాటానికి సిద్ధమవుతున్న కాంగ్రెస్‌తో ప్రజాస్వామ్యవాదులందరూ కలిసి రావాలి.

# ఉత్తర తెలంగాణ నేతకు మంత్రి పదవి?

మాజీ మంత్రి, సీనియర్ నేత జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పడంతో ఉత్తర తెలంగాణలోని రెడ్డి సామాజిక వర్గం నేతలు గుర్రుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. పార్టీకి ఇంతకాలం గట్టి మద్దతుదారుగా ఉన్న తమకు ప్రభుత్వంలో సరైన ప్రాధాన్యత ఇవ్వట్లేదనే అభిప్రాయంలో ఆ వర్గం నేతలు ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం గమనించిన కాంగ్రెస్ అధిష్టానం నష్టనివారణకు చర్యలు చేపట్టినట్టు . త్వరలో జరుగనున్న కేబినెట్ విస్తరణలో ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన ఓ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని యోచనలో ఉన్నట్లు తెలిసింది.

**ఆ రెడ్లకు మంత్రి పోస్టు రాలే..**


ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని రెడ్డి సామాజిక వర్గం నేతలు రాజకీయాలను ప్రభావితం చేయగలరు. ఆయా జిల్లాల్లో పార్టీల గెలుపోటములను నిర్ణయించే శక్తిగా ఎదిగారు. కానీ, కాంగ్రెస్ సర్కారులో ఆ వర్గానికి చెందిన లీడర్లకు జిల్లాలు, సామాజిక సమీకరణాల కారణంగా మంత్రి పదవి దక్కలేదు. దీంతో వారంతా గుర్రుగా ఉన్నారు. సందర్భం వచ్చిన ప్రతిసారీ తమ అసంతృప్తిని వెల్లిబుచ్చుతున్నట్టు తెలిసింది. సరిగ్గా ఈ సమయంలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి వెళ్లడంతో ఆ సామాజిక వర్గానికి చెందిన లీడర్లు అసహనంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఉత్తర తెలంగాణ రెడ్లను అవమానాలకు గురిచేసి, పార్టీ నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చర్చ జరుగుతున్నది. ఈ విషయం గ్రహించిన కాంగ్రెస్ అధిష్టానం ఉత్తర తెలంగాణకు చెందిన ఓ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

**ఆ లక్కీ పర్సన్ ఎవరు..?**

ఉత్తర తెలంగాణకు చెందిన రెడ్డి ఎమ్మెల్యేలలో ఒకరికి మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని వార్తలు రావడంతో ఆ అదృష్టవంతుడు ఎవరు? అనే చర్చ జరుగుతున్నది. ఆ 4 ఉమ్మడి జిల్లాల నుంచి ఆరుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఉన్నారు.(ఉమ్మడి నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, యశస్విని రెడ్డి, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి రెడ్డి ఎమ్మెల్యేలు లేరు) ఈ ఆరుగురిలో అందరికంటే సీనియర్ ఎమ్మెల్యేగా సుదర్శన్ రెడ్డి ఉన్నారు. ఆయన్ను మంత్రివర్గంలోకి తీసుకునేందుకు సమీకరణలు కుదరకపోవడంతో ప్రభుత్వ సలహాదారు పదవీ ఇచ్చారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన్ను మంత్రివర్గంలోకి తీసుకునేందుకు హైకమాండ్ మొగ్గుచూపుతుందా? లేదా జిల్లాల సమీకరణల నేపథ్యంలో వరంగల్ జిల్లాకు ప్రయారిటీ ఇస్తుందా?అనే చర్చ జరుగుతున్నది. పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మొన్నటివరకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సీఎం రేవంత్‌తో అంటిముట్టనట్టుగా వ్యవహరించారు. కానీ, కొన్ని రోజులుగా ఆయన వ్యవహారశైలిలో మార్పు వచ్చింది. సీఎంతో సన్నిహితంగా ఉంటున్నారు. దీనితో ఆయనకు ఏమైన కేబినెట్‌లో చాన్స్ దక్కుతుందా? అనే చర్చ జరుగుతున్నది.

**రెడ్డి మంత్రులు దక్షిణాది వారే..**

రేవంత్ రెడ్డి కేబినెట్‌లో ఆయనతో కలుపుకుని మొత్తం నలుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మంత్రులు ఉన్నారు. వీరంతా దక్షిణ తెలంగాణకు చెందిన వారే.( రేవంత్ రెడ్డి –ఉమ్మడి మహబూబ్ నగర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి–ఉమ్మడి నల్గొండ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి– ఉమ్మడి నల్గొండ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి–ఉమ్మడి ఖమ్మం) దీంతో ఉత్తర తెలంగాణకు చెందిన రెడ్డి లీడర్లు తమకు ప్రభుత్వంలో భాగస్వామ్యం లేదా? ఆ జిల్లాలకు చెందిన లీడర్లతోనే పార్టీ అధికారంలోకి వచ్చిందా? అని పార్టీ అంతర్గత సమావేశాల్లో ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.



ఏఐ జనరేటెడ్ ఫోటో

# కాంగ్రెస్ ఇమేజ్ డ్యామేజ్..

**రంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** బడంగ్ పేట్ కార్పోరేషన్ హయాంలో జరిగిన అవినీతి బయట పడ్డాక.. రాజకీయం అంతా ఓ నేత చుట్టే తిరుగుతోంది. అవినీతి పై అందరి వేళ్లు ఒకరివైపే చూపిస్తున్నాయి. ప్రతిపక్షాలు సైతం ఆ నేతదే బాధ్యత అంటూ ఒక స్వరాన్నే ఆలపిస్తున్నాయి. దీనికి తోడు ఓ రాజకీయ నేత ఆత్మహత్య ఉదంతంలో కూడా ఆరోపణలకు ఆ నేతనే కేంద్ర బిందువయ్యారు. ఆ నేతపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవ, అవాస్తవాల మాట ఎలా ఉన్నా!. ప్రస్తుత పరిస్థితులు మాత్రం అధికార పార్టీ కాంగ్రెస్ పునాదులను బీటలు వారేలా చేస్తున్నాయి. ఆ నేత భవిష్యత్తును సైతం ప్రశ్నార్థకంలో పడేస్తున్నాయి. ఈ పరిణామాలు సొంత పార్టీ శ్రేణులను సైతం గందరగోళంలో పడేస్తున్నాయి. కార్పోరేషన్ లో జరిగిన అవినీతి మరక రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా తీవ్ర ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**ప్రతి పక్షాలకు కొత్త అస్త్రం..**

బడంగ్‌పేట్‌లో జరిగిన అవినీతిలో బాధ్యులైన అధికారులపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు వేటు వేశారు. అయితే ఇందులో అధికారులు బలి పశువులు అయ్యారని, తెరవెనుక రాజకీయ ప్రమేయం ఉందన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపించాయి. గత పదేళ్లలో పనిచేసిన పాలకవర్గాల ప్రమేయంపై కూడా సమగ్ర విచారణ జరిపించాలన్న డిమాండ్లు సైతం తెరపైకి వచ్చాయి. బడంగ్‌పేట్ ఉదంతంపై కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు సైతం స్పందించాయి. తప్పు మీదంటే మీదంటూ ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకున్నారు. కానీ.. గత పాలకవర్గ హయాంలోనే పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగాయంటూ, అప్పటి పాలకవర్గంలోని ఓ నేతను ప్రతిపక్షాలు టార్గెట్ చేసి ప్రెస్ మీట్ లు సైతం పెట్టారు. దీన్ని కాంగ్రెస్ తో పాటు సదరు నేత సైతం ఖండించారు. పాలకవర్గం గడువు పూర్తయిన తర్వాతనే అవినీతి జరిగిందని, అధికారులదే ఆ బాధ్యత అంటూ సదరు నేత అవినీతి నెపాన్ని అధికారులపై మోపే ప్రయత్నం చేశారు. ఇంతటితో అంతా సద్దుమణిగింది అనుకుంటున్న తరుణంలో బీజేపీ పార్టీకి చెందిన నేత ఒకరు ఆత్మహత్య చేసుకోవడం..అతని భార్య ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత పై ఆరోపణలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. బీజేపీ నేత మృతిపై పారదర్శకంగా విచారణ జరపాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సైతం పోలీసులను విజ్ఞప్తి చేశారు. ఏది ఏమైనా బడంగ్ పేట్ కార్పోరేషన్ లో జరిగిన అవినీతితో ప్రతిపక్ష పార్టీలకు కొత్త అస్త్రం దొరికినట్లైంది. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఇదే అంశాన్ని ప్రధాన ఎజెండాగా చేసుకోనున్నాయి.

**కాంగ్రెస్ ఆశలపై నీళ్లు!**

రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసిన బడంగ్ పేట్ అవినీతి వ్యవహారం రాజకీయంగా దుమారమే లేపింది. అయితే.. అవినీతిలో రాజకీయ ప్రమేయం పై ఇప్పటివరకు ఏసీబీ దృష్టి పెట్టలేదు. కాంగ్రెస్ అధిష్టానం సైతం బడంగ్ పేట్ అంశాన్ని సీరియస్ గానే తీసుకుందన్న ప్రచారం జరుగుతున్నప్పటికీ.. ప్రభుత్వం సైతం ఎటువంటి ప్రకటన చేయలేదు. కానీ.. అధికార పార్టీ ఇమేజ్ కు మాత్రం ఇది పెద్ద డ్యామేజేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జీహెచ్ఎంసీలో విజయకేతనం ఎగరవేయాలన్న అధికార కాంగ్రెస్ ఆశలపై నీళ్లు చల్లినట్లు అయిందన్న వ్యాఖ్యలు సైతం పొలిటికల్ వర్గాల నుంచి విన్పిస్తున్నాయి. విమర్శలు ఎదుర్కొంటున్న నేతతోపాటు ఒకరిద్దరు నేతలు మినహాయిస్తే.. రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలెవరూ బడంగ్ పేట్ వ్యవహారంపై నోరు విప్పిన సందర్భాలు లేవు. చాలా మంది నేతల పరిస్థితి మింగలేక, కక్కలేక అన్నట్లుగా ఉందన్న టాక్ నడుస్తోంది. ఈ ప్రాంతంలో రోజురోజుకూ పార్టీకి జరుగుతున్న నష్టం పై సొంత పార్టీ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధిష్టానం నష్ట నివారణ చర్యలపై తగు చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ పార్టీ కేడర్ నుంచి విన్పిస్తోంది.

# రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో 'భూ' మాయాజాలం

**చౌటుప్పల్,ఫ్లాష్ ఇండియా:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి నిలయంగా మారింది. కాసులకు కక్కుర్తి పడిన కొందరు అధికారులు ఎలాంటి చట్టబద్ధమైన పత్రాలు లేకపోయినా రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తున్నారు. అర్హులైన సామాన్యులను నిబంధనల పేరుతో నెలల తరబడి ఇబ్బందులకు గురి చేసే అధికారులు, అక్రమార్కులకు మాత్రం దొడ్డిదారిన మార్గం సుగమం చేస్తున్నారు. ఈ క్రమంలోనే నిషేధిత జాబితాలో ఉన్న భూములను సైతం గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ చేసి, గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు రూ.వందల కోట్లు కూడబెట్టినట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఆన్‌లైన్ పహాణీతోనే మాయాజాలం..**

సంస్థాన్ నారాయణపురం మండలంలోని రాచకొండ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 84 లో జరిగిన ఓ భూ వ్యవహారం ఇక్కడి అక్రమాలకు అద్దం పడుతోంది. ఓ వ్యక్తికి చెందిన 10 ఎకరాల 26 గుంటల భూమి ధరణి రాకముందు ఆన్‌లైన్ రికార్డుల్లో 'వ్యవసాయేతర' భూమిగా నమోదై ఉంది. సాధారణంగా ఇలాంటి భూములను వ్యవసాయ భూమిగా రిజిస్ట్రేషన్ చేయడం చట్టరీత్యా అసాధ్యం. కానీ, సదరు ఆన్‌లైన్ పహాణీ కాపీలో డిజిటల్ సంతకం కూడా లేనప్పటికీ, నాటి సబ్ రిజిస్ట్రార్ భారీగా ముడుపులు తీసుకుని నిబంధనలను తుంగలో తొక్కారు. కేవలం ఆన్‌లైన్ ప్రింట్ కాపీ ఆధారంగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయడం వెనుక ఉన్న లబ్ధి స్పష్టంగా కనిపిస్తోంది.

**వ్యవసాయేతర డ్యూటీ.. వ్యవసాయ రిజిస్ట్రేషన్..**

ఈ భూమికి సంబంధించి చెల్లించిన స్టాంప్ డ్యూటీ మరొక పెద్ద కుంభకోణానికి దారితీస్తోంది. సదరు యజమాని స్టాంప్ డ్యూటీని 'వ్యవసాయేతర' కేటగిరీ కింద చెల్లించి, రిజిస్ట్రేషన్ మాత్రం 'వ్యవసాయ భూమి'గా చేయించుకోవడం గమనార్హం. ఒకవేళ అది నిజంగానే వ్యవసాయ భూమి అయితే, యజమాని వ్యవసాయేతర రేట్ల ప్రకారం స్టాంప్ డ్యూటీ ఎందుకు చెల్లించారు? అలాగే, వ్యవసాయేతర డ్యూటీ చెల్లించినప్పుడు సబ్ రిజిస్ట్రార్ దానిని వ్యవసాయ భూమిగా ఎలా రిజిస్టర్ చేశారు? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నలుగా మిగిలాయి. రాచకొండ పరిధిలో ఇలాంటి 'మార్పిడి' రిజిస్ట్రేషన్లు మరెన్నో జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**ధరణి రాకముందే పక్కా స్కెచ్..**

అక్టోబర్-29, 2020న ధరణి పోర్టల్ అమల్లోకి రావడానికి సరిగ్గా మూడు నెలల ముందే ఈ అక్రమాలకు పునాది పడింది. ధరణి వస్తే ఇలాంటి తప్పుడు పనులు సాధ్యం కాదని గుర్తించిన అక్రమార్కులు, జూలై 2020లో సబ్ రిజిస్ట్రార్‌తో కుమ్మక్కై ఈ దందాను పూర్తి చేశారు. సాధారణంగా ఇలాంటి భూములకు తహశీల్దార్ కార్యాలయం నుంచి ఎన్‌ఓసీ తప్పనిసరి. కానీ అధికారులు ఆ దిశగా ఎలాంటి విచారణ చేయకుండానే పని పూర్తి చేసేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యాలయాలపై ఏసీబీ, విజిలెన్స్ దాడులు జరుగుతున్న నేపథ్యంలో చౌటుప్పల్ కార్యాలయంలోని పదేళ్ల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తే అధికారుల అసలు బండారం బయటపడుతుందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# భద్రాద్రిలో ఎన్నికల 'జ్వాల'..

**భద్రాచలం,ఫ్లాష్ ఇండియా :** మొన్నటి వరకు అసలు జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తారా.. రద్దు చేస్తారా..? అని సందిగ్ధంలో ఉండగా... శనివారం మంత్రి పొంగులేటి వేసవి తర్వాత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతాయని ప్రకటించడంతో భద్రాద్రిలో ఒక్కసారిగా ఎన్నికల వేడి ప్రారంభమైంది. భద్రాద్రిని ప్రపంచంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొదటి విడతగా రూ.351కోట్లు నిధులు కేటాయించడంతో ఇక్కడ జడ్పీటీసీ స్థానానికి ప్రాధాన్యత సంతరించుకుంది. అంతే కాకుండా జెడ్పీటీసీ స్థానం బీసీ జనరల్‌కు కేటాయించడంతో అన్ని రాజకీయ పార్టీలలో ఆశావహులు పెరుగుతున్నారు. ఎట్టి పరిస్థితిలో జెడ్పీటీసీ పీఠం కైవసం చేసుకోవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టులు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టారు.

**పెరుగుతున్న ఆశావహులు..**

1986నుంచి కాంగ్రెస్ పార్టీలో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, జిల్లా సెక్రెటరీగా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, సెంట్రల్ ఫార్మాసిటికల్ అడ్వైజరి బోర్డ్ సభ్యుడిగా పనిచేసి, ప్రస్తుతం పీసీసీ సభ్యుడిగా కొనసాగుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బుడగం శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నుంచి జెడ్పీటీసీ టికెట్ ఆశిస్తున్నారు. తనకు పార్టీ నుంచి అందరి సహకారం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శ్రీనివాస్‌తో పాటు మరికొందరు టికెట్ ఆశిస్తున్న వారిలో ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఆకోజు సునీల్ కుమార్ జెడ్పీటీసీ టికెట్ ఆశిస్తున్నారు. పార్టీ టికెట్ కేటాయిస్తే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు.బీఆర్ఎస్ పార్టీలోకి రాకముందు సీపీఐ మండల కార్యదర్శిగా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉండటంతో బీఆర్ఎస్ టికెట్ తనకే దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా అనేకమంది జెడ్పీటీసీ టికెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఇక సీపీఎం, సీపీఐ సైతం ఈసారి జెడ్పీటీసీ స్థానం వదులుకోవడానికి సిద్ధంగా లేదు. ఉభయ కామ్యూనిస్టులు కలిసి పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తుంది. జెడ్పీటీసీ స్థానం కైవసం చేసుకుని తమ సత్తా చాటాలని ఎదురు చూస్తున్నారు. ఏ రాజకీయ పార్టీతో పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగానే బరిలో నిలిచే అవకాశం ఉంది. సర్పంచ్ ఎన్నికలలో భంగపడ్డ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి కూడా తమ అభ్యర్థిని నిలిపేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. భద్రాద్రి ప్రజలు ఎవరికి పట్టంకడతారో వేచి చూడాలి.

# నాన్న అందుకే నక్సలైట్‌గా మారారు



**జార్ఖండ్ :** జార్ఖండ్‌లోని అత్యంత ప్రమాదకరమైన మావోయిస్టు నాయకులలో ఒకరై, రూ.కోటి రూపాయల రివార్డు కలిగిన మిసిర్ బెస్రా కుటుంబ గాథను ఆయన కుమారుడు సిద్ధార్థ్ బెస్రా ఎట్టకేలకు బయటపెట్టాడు. ఓ ప్రముఖ జాతీయ మీడియా ప్రతినిధులు గిరిడీలోని పీర్టాండ్‌లో ఉన్న వారి పూర్వీకుల ఇంటికి వెళ్లినప్పుడు, సిద్ధార్థ్ తన తండ్రి గురించి, తమ కుటుంబం ఎదుర్కొన్న కష్టాలను వివరించారు.

**అవినీతి వల్లే అడవి బాట..**

మిసిర్ బెస్రా పీజీ చదివిన విద్యావంతుడని ఆయన కుమారుడు సిద్ధార్థ్ బెస్రా తెలిపారు. ధన్‌బాద్‌లోని పీకే రాయ్ మెమోరియల్ కాలేజీలో చదువుకున్న ఆయనకు ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చే అవకాశం ఉందన్నారు. కానీ, జాయినింగ్ సమయంలో ఉన్నతాధికారులు రూ.8 వేల రూపాయల లంచం డిమాండ్ చేశారని తెలిపారు. కాళ్ల, వేళ్లా పడినా ఎవరూ అయనను కనికనించలేదని పేర్కొన్నారు. చివరికు భూమి అమ్మయినా లంచం ఇస్తామని కుటుంబ సభ్యులు అన్నప్పటికీ, 'అర్హత ఉన్నప్పుడు లంచం ఎందుకు ఇవ్వాలి?' అని ప్రశ్నిస్తూ మిసిర్ బెస్రా ఆ ఉద్యోగాన్ని సున్నితంగా తిరస్కరించారని.. ఆ మనస్తాపంతోనే ఆయన మావోయిస్ట్ పార్టీలో చేరారని సిద్ధార్థ్ బెస్రా తెలిపారు.

**చితికిపోయిన కుటుంబం..**

సిద్ధార్థ్‌కు ఏడేళ్ల వయసున్నప్పుడే తండ్రి మిసిర్ బెస్రా ఇల్లు వదిలి వెళ్లినట్లుగా గ్రమస్థులు తెలిపారు. ఆ తర్వాత తల్లి కూడా వెళ్లిపోయింది, సోదరి శాంతి కూడా మరణించినట్లుగా తెలిసింది. తాతయ్య సంరక్షణలో పెరిగిన సిద్ధార్థ్ బెస్రా పదో తరగతి వరకు చదివి, బతుకుదెరువు కోసం మహారాష్ట్రకు వెళ్లారు. అక్కడ ఒక పౌడర్ మిల్లులో నెలకు రూ.9 వేల రూపాయల జీతానికి పనిచేస్తున్నారు. 'గత 28 ఏళ్లుగా నా తండ్రిని చూడలేదు. ఇప్పుడు ఆయన వయసు 70 ఏళ్లు. ఆయన అన్యాయంపై పోరాటం చేసింది చాలు, ఇప్పుడు విశ్రాంతి అవసరం. తుపాకీ వదిలి, పోలీసులకు లొంగిపోయి తిరిగి ఇంటికి రావాలని నేను చేతులు జోడించి వేడుకుంటున్నా' అని సిద్ధార్థ్ బెస్రా మీడియా ముఖంగా తండ్రి మిసిర్ బెస్రాకు విజ్ఞప్తి చేశారు.

**లొంగిపోయేందుకు చివరి అవకాశం**

తాజాగా, సీఆర్‌పీఎఫ్ స్పెషల్ డైరెక్టర్ జనరల్ దీపక్ కుమార్ బాలిబా క్యాంప్‌ను సందర్శించి భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టమైన సంకేతాలు పంపారు. మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఈస్టర్న్ రీజనల్ బ్యూరో (ఈఆర్బీ) ఇన్చార్జి, జార్ఖండ్‌కు చెందిన అగ్రనేత మిసిర్ బెస్రా అలియాస్ సాగర్‌కు నెలరోజుల సమయం ఇస్తున్నామని.. ఈ లోపు అతడు లొంగిపోవాలని లేదంటే ఎన్‌కౌంటర్ చేస్తామని హెచ్చరించారు. బెస్రాతో పాటు అతని టీమ్‌కు లొంగిపోవడమే వారి ముందున్న ఏకైక మార్గమని దీపక్ కుమార్ క్లియర్ వార్నింగ్ ఇచ్చారు.

# అటకెక్కిన అభివృద్ధి

**ఆలేరు,ఫ్లాష్ ఇండియా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలో కీలకమైన అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటంతో పట్టణ అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ) వంటి ప్రధాన పోస్టులు గత ఆరున్నర ఏళ్లుగా భర్తీకి నోచుకోలేదు. భువనగిరి మున్సిపల్ ఏఈని ఇక్కడ ఇన్చార్జిగా నియమించినప్పటికీ, ఆయన నెలలో ఒక్క రోజు కూడా ఆలేరు మున్సిపాలిటీకి రాకపోవడం గమనార్హం. దీనివల్ల మంచినీటి సరఫరా, మురుగు కాలువల నిర్మాణం, రోడ్ల మరమ్మతులు వంటి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అలాగే జనగామ టీపీఓ వారానికి ఒకటి రెండు రోజులే అందుబాటులో ఉండడం తో టౌన్ ప్లానింగ్ సేవల కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

**ఖజానాలో రూ.30 కోట్ల నిధులు!**

ఆలేరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం టీఎఫ్ఐడీసీ, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా సుమారు రూ.30 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో మున్సిపల్ కార్యాలయ భవనం, 12 వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని గత, ప్రస్తుత పాలకవర్గాలు తీర్మానాలు కూడా చేశాయి. అయితే, సాంకేతికంగా పనుల అంచనా విలువ (ఎస్టిమేషన్), అనుమతులు, టెండర్ల ప్రక్రియ నిర్వహించేందుకు రెగ్యులర్ ఏఈ లేకపోవడంతో ఈ నిధులు ఖజానాలోనే మూలుగుతున్నాయి. కొత్తగా ఎన్నికైన చైర్మన్, కౌన్సిలర్లు వార్డుల్లో పర్యటిస్తూ సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నప్పటికీ, టెక్నికల్ సిబ్బంది లేక ఆ పనులు పూర్తి చేయలేక ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి దాపురించింది. 'దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించని' చందంగా ఆలేరు మున్సిపాలిటీ పరిస్థితి తయారైందని స్థానికులు మండిపడుతున్నారు.

**కీలక పోస్టుల భర్తీ ఏదీ?**

మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన నాటి నుంచి ఆలేరులో ఏఈ, టీపీఓ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వర్క్ ఇన్‌స్పెక్టర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇన్చార్జి అధికారులు కార్యాలయంలో నిత్యం అందుబాటులో ఉండకపోవడం వల్ల పట్టణంలో అభివృద్ధి కుంటు పడడమే కాకుండా, ప్రజల కనీస అవసరాలు కూడా తీరడం లేదు. మౌలిక వసతుల కల్పనలో మున్సిపాలిటీ విఫలమవడంతో వర్షాకాలం వస్తే మురుగు నీరు రోడ్లపైకి చేరుతోందని, వీధి దీపాలు, మంచినీటి సరఫరా వంటి పనులు కూడా పర్యవేక్షించేవారు లేక అస్తవ్యస్తంగా మారుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ప్రజల అసంతృప్తి..**

నిధులు అందుబాటులో ఉన్నా అధికారులు లేకపోవడంతో అభివృద్ధి జరగకపోవడంపై పట్టణ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇన్చార్జిల పాలనలో మున్సిపాలిటీకి రావాల్సిన అనుమతులు రాక, కొత్త ఇళ్ల నిర్మాణాలకు ప్లానింగ్ అనుమతులు లభించక జనం ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా జోక్యం చేసుకొని, ఖాళీగా ఉన్న పోస్టులను రెగ్యులర్ సిబ్బందితో భర్తీ చేయాలని, ఆలేరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# అత్యవసరమైతేే తప్ప బయటకు రావొద్దు

**ములుగు,ఫ్లాష్ ఇండియా :** ప్రస్తుత వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ములుగు మున్సిపాలిటీ వారు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, మండుతున్న ఎండల కారణంగా ప్రజలు ఎవరు బయటకు రావద్దని మంత్రి దనసరి అనసూయ(సీతక్క) అన్నారు. ములుగు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించి ప్రారంభించడం జరుగుతుందని, పోలీస్ హెడ్ క్వార్టర్స్ ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం వల్ల విధులు నిర్వహిస్తున్న పోలీసులకు, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ములుగు మున్సిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, మున్సిపాలిటీ కమిషనర్ రమేష్, ములుగు ఎస్ఐ ఉపేందర్ రావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# కబ్జా స్థలంలో మీటింగ్ పెట్టి...

**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** కబ్జా స్థలంలో మీటింగ్ పెట్టి మాకు నీతులు చెబుతున్నారా అంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. సోమవారం ఖమ్మం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిన్న జన్మదిన వేడుకల్లో.. ఆత్మీయ సమ్మేళనమే నాకు తెలియదు కానీ, హరీష్ రావు మాట్లాడే తీరును చూస్తే ఆయన మానసిక స్థితి సరిగా లేదని అర్థమవుతుందని అన్నారు. పదేళ్ల పాలనలో మీరు ఆర్థిక విధ్వంసం సృష్టించి ఈరోజు మాకు నీతులు చెబుతున్నారా అంటూ మంత్రి తుమ్మల హరీష్ రావు పై ఫైర్ అయ్యారు. సీతారామ ప్రాజెక్ట్ నా చిరకాల స్వప్నం అని దాని పూర్తి చేసేందుకు ఇల్లందు నియోజకవర్గంలో రోళ్ళపాడు వద్ద శంకుస్థాపన చేయడం జరిగిందని, మీ హయాంలో కమిషన్ల కోసం సీతారామ ప్రాజెక్టును నిర్వీర్యం చేశారన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చిన తర్వాత నిధులు కేటాయించి సీతారామ ప్రాజెక్టు ను పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. సత్తుపల్లి టన్నెల్ కోసం రూ 1500 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. గోదావరి జలాలను వైరా రిజర్వాయర్ కు తరలించిన ఏకైక ప్రభుత్వం రేవంత్ సర్కార్ అన్నారు. మీ హయాంలో రైతు బంధు, సీఎం రిలీఫ్ ఫండ్ స్కాం లు జరగలేదా అంటూ ప్రశ్నించారు. భూ కబ్జాలు, ప్రజల పై కేసులు పెట్టించి నానా ఇబ్బందులకు గురిచేసింది ఎవరో ప్రజలకు తెలుసు అన్నారు. రుణమాఫీ మొదటి మూడు నెలల్లో రైతులు ఖాతాలో జమ చేసిన ఏకైక ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ అన్నారు. రూ. 25 వేల కోట్ల రూపాయలను రైతు ఖాతాలో జమ చేశామని, మీకు అనుమానం ఉంటే ఖాతా నెంబర్లు ఇస్తాము వెళ్లి చెక్ చేసుకోండి అన్నారు. పది సంవత్సరాల్లో మీరు సృష్టించిన విధ్వంసాన్ని సరి చేసుకుంటూ కష్టాల్లో ఉన్న కూడా ప్రతి ఒక్క సంక్షేమ పథకం అమలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. పార్టీలో హరీష్ రావు స్థాయి ఏందో ముందు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు.



విలేకరుల సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మాజీ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

**ఏ ముఖం పెట్టుకుని అధికారంలోకి వస్తామంటున్నారు?**

పదవి పోయిన ఆందోళన, ఆక్రోశం బీఆర్ఎస్ నేతల్లో ఉందని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదని స్టీరియో రికార్డు వినిపిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఆరోపణలతో బీఆర్ఎస్ నేతల బతుకు బజారుపాలవుతుందని, గత అవినీతి వల్లే బీఆర్ఎస్ అస్థిత్వం, స్థానం, అధికారం పోయింది ఏ ముఖం పెట్టుకుని మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతున్నారని మండిపడ్డారు. ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన.. సీతారామ పథకం నాతో పాటు ఖమ్మం జిల్లా ప్రజలకు ఆకాంక్ష అని నేను టీడీపీలో ఉన్నప్పుడే దుమ్ముగూడెం ప్రాజెక్టు డిజైన్ చేశారని, వైఎస్సార్ హయాంలో ఇందిరా సాగర్-రాజీవ్ సాగర్ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. వైఎస్సార్ మరణానంతరం ఇందిరా సాగర్-రాజీవ్ సాగర్ పథకానికి తిలోదకాలు దిద్దారన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక నా ప్రధాన కోరిక సీతారామ ప్రాజెక్టు అని చెప్పానన్నారు. బీఆర్ఎస్ పార్టీ సిగ్గులేకుండా సీతారామ ప్రాజెక్టు గురించి మాట్లాడుతోందని మండిపడ్డారు.

# ముస్లిం నాయకత్వం పై ఒవైసీ వ్యాఖ్యలకు బీజేపీ కౌంటర్



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారతదేశంలో ప్రతి సామాజిక వర్గానికి ఒక నాయకత్వం ఉందని, కానీ ముస్లింలకు మాత్రమే నాయకత్వం లేదని అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తీవ్రంగా స్పందించారు. "ముస్లింలే కాంగ్రెస్.. కాంగ్రెస్సే ముస్లింలు" అని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే ప్రకటించారని, అలాంటప్పుడు మీకు వేరే నాయకత్వం ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఓవైసీ వ్యాఖ్యలపై రామచందర్ రావు స్పందిస్తూ.. "ముస్లింలకు నాయకత్వం లేదని ఒవైసీ అనడం హాస్యాస్పదం. కాంగ్రెస్ పార్టీలోనే మీకు అనేక మంది నాయకులు ఉన్నారు.రేవంత్ రెడ్డి మాటల ప్రకారం చూస్తే కాంగ్రెస్ పార్టీయే ముస్లింల పక్షాన ఉంది. ఇంకా మీకు ప్రత్యేక నాయకత్వం ఎందుకు?" అని రామచందర్ రావు నిలదీశారు. భారతీయ జనతా పార్టీ కులాల వారీగా నాయకులను తయారు చేయదని, ప్రతి కులం, మతం, వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనుల సంక్షేమం కోసం తమ పార్టీ పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఓవైసీ కేవలం తన రాజకీయ లబ్ది కోసమే ఇలాంటి విభజన రాజకీయాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు మానుకోవాలని ఆయన సూచించారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఓ బహిరంగ సభలో అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. ముస్లింలు కేవలం ఓటర్లుగానే మిగిలిపోతున్నారని, స్వతంత్ర రాజకీయ నాయకత్వాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ ఆయనపై ఎదురుదాడికి దిగింది.



# తెలంగాణలో ఆర్టీసీలో సమ్మె సైరన్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు మరోసారి సమ్మె బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం గడువు ముగుస్తుండటంతో మరో 48 గంటల్లో సమ్మెకు వెళ్లేందుకు అన్ని డిపోల ఆర్టీసీ జేఏసీ నేతలు సన్నద్ధమయ్యారు. అయితే, ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి చర్చలకు అధికారికంగా ఎటువంటి పిలుపు రాకపోవడం ఉత్కంఠను పెంచుతోంది. ఆర్టీసీ కార్మికులు కోరుతున్న డిమాండ్లలో మెజారిటీ అంశాలకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లుగా తెలుస్తోంది. అయితే, ప్రధానమైన 'ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం', 'యూనియన్ల పునరుద్ధరణ' అనే రెండు డిమాండ్ల విషయంలో మాత్రం ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. ఈ రెండూ మినహా మిగిలిన అన్నింటిపై సానుకూలత వ్యక్తం చేసినా, జేఏసీ నేతలు మాత్రం తమ పట్టు వీడటం లేదు.

**మంత్రి పొన్నంతో రేపు కీలక భేటీ..?**

సమ్మె అనివార్యమైతే సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ప్రైవేట్ డ్రైవర్లను సిద్ధం చేయడం, అద్దె బస్సులను నడపడం వంటి అంశాలపై రవాణా శాఖ దృష్టి సారించింది. ఈ క్రమంలోనే, రేపు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఆర్టీసీ జేఏసీ నేతలు మరోసారి భేటీ అయ్యే అవకాశం ఉంది. ఈ సమావేశం సఫలమైతేనే సమ్మె విరమణ దిశగా అడుగులు పడతాయి, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థ స్తంభించే ప్రమాదం ఉంది.

# పూడికతీత పక్కకు ఇసుక దందా..

**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వం ప్రాజెక్టుల్లో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు చేపట్టిన ప్రాజెక్టు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పక్కదారి పట్టిస్తున్నారు. ప్రభుత్వ పథకాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని అక్రమ దందాకు తెరలేపుతున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం అక్రమ దందాలో చేతులు కలపడంతో కాంట్రాక్టర్ ప్రభుత్వం నిర్ధేశించిన పనిని పక్కకు పెట్టి కాంట్రాక్టర్‌కు ఆదాయం వచ్చే అక్రమ దందాను సాగిస్తున్నారు. పూడిక ను తొలగించకుండా ఇసుకను తవ్వుతూ మార్కెట్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ పనులకు కేటాయించిన కోట్లాది రూపాయలను తమ ఖాతాలో జమచేసుకుంటునే కాంట్రాక్ట్ దక్కించుకున్న బడా కంపెనీ బద్మాష్ దందాకు తెరలేపి అక్రమ ఇసుక దందా సాగిస్తూ రూపాయి పెట్టుబడి లేకుండా కోట్లరూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు.

**పూడికను తొలగించకుండా ఇసుక తవ్వకాలు**

ప్రభుత్వం రాష్ట్రం లోని పలు ప్రాజెక్టుల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి నీటి సామర్థ్యాన్ని పెంచేందుకు శ్రీకారం చుట్టింది. అందులో ముందుగా మూడు ప్రాజెక్టుల్లో ఎల్ఎండీ రిజర్వాయర్, మిడ్ మానేరు, కడెం ప్రాజెక్టు ల్లో పూడికను తీసి మట్టిని రైతులకు, ఇసుకను అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తూ రూ. 1457 కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచింది. ఆ టెండర్లలో పాల్గొన్న ఈథర్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ అండ్ట్రినిటి సాండ్ అండ్ మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అండ్సహారా డ్రెడ్జింగ్ లిమిటెడ్ కంపెనీలు దక్కించుకున్నాయి. ముందుగా ఎల్ ఎండీ రిజర్వాయర్ లో పనులను ప్రారంభించిన కాంట్రాక్ట్ కంపెనీలు కొద్ది రోజులు ప్రాజెక్టు లోపల పూడికను తీస్తూ ఇసుక మట్టిని వేరు చేస్తున్న క్రమంలో మట్టి రాళ్లు వచ్చి యంత్రాలు మరమ్మత్తులకు వచ్చాయి.దీంతో ఇబ్బందిగా పరిగణించిన కాంట్రాక్టు కంపెనీలు సులువుగా పనిముగించుకునేందుకు అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రభుత్వ లక్ష్యాన్ని పక్కనపెట్టి అక్రమ దందాకు శ్రీకారం చుట్టాయి. రిజర్వాయర్ లో పూడికను తీయాల్సిన కాంట్రాక్టరు ఆ పనులు పక్కన పెట్టి ప్రాజెక్టులోకి వరదనీరు చేరే మోయతుమ్మెద వాగులో ఇసుకను తోడి విక్రయించడానికి శ్రీకారం చుట్టింది. అయితే అది జిల్లా సరిహద్దులు దాటి ఇసుక తవ్వకాలు చేపట్టడం తో ఇద్దరు అధికార పార్టీ నేతల మధ్య వివాదం చెలరేగి అక్రమ దందాకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ప్రస్తుతం అధికార పార్టీ నేతలు, అధికారులు అక్రమాల్లో పాలుపంచుకోవడంతో అక్రమ దందా మళ్లీ మొదలు కావడం పై సర్వత్రా విమర్శలు వ్యక్తవవుతున్నాయి.

**అనుమతులు ఒక చోట ఇసుక తీసుడు మరోచోట**

లోయర్ మానేర్ డ్యాం రిజర్వాయర్ లో పేరుకు పోయిన పూడికను తొలగించి అందులో అందులో నుంచి మట్టిని ఇసుకను వేరు చేసి మట్టిని రైతులకు, ఇసుకను కాంట్రాక్టర్ అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం పిలిచిన టెండర్లలో పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ కంపెనీ రిజర్వాయర్ లో పేరుకు పోయిన పూడికను పక్కన పెట్టి అక్రమ ఇసుక దందాకు తెరలేపడం స్థానికంగా వివాదస్పదంగా మారింది. ప్రభుత్వం అధికారికంగా రిజర్వాయర్లో పనులు చేసేందుకు అనుమతులు తీసుకున్న కాంట్రాక్ట్ కంపెనీ అక్రమ దందా చేస్తూ ఇసుకను తవ్వడం పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే అనుమతులు ఒక్కచోట అక్రమ దందా మరోచోట జరగడం పక్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం పై అధికారులు, అధికార పార్టీ నేతలు అండదండలతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ కోట్లాది రూపాయలు సొమ్ముచేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి

**అధికారులు, పాలకుల అక్రమ దందా**

అధికారులు, పాలకులు ఒక్కటయ్యారు...అక్రమదందాకు తెరలేపారు. పైలెట్ ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. అనుమతులు ఒక చోట పొంది మరో చోట ఇసుకను తోడుతూ బడా కంపెనీ బద్మాష్ దందా సాగిస్తుంది. అధికారులు అధికార పార్టీ నేతలు ఒక్కటవ్వడం తో అక్రమ దందా యథేచ్ఛగా సాగుతూ కోట్ల రూపాయల ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. అయితే స్థానికులు వ్యతిరేకించడంతో ఇద్దరు నాయకుల మధ్య వివాదంగా మారి కొంత కాలం అక్రమ దందాకు బ్రేకులు పడగా హద్దులు మార్చడం తో ఇప్పుడు అక్రమ దందా అడ్డూ అదుపులేకుండా సాగుతుంది అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం**

తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టుల్లో పేరుకుపోయిన పూడిక తీసి నీటి నిలువ సామర్థ్యం పెంచేందుకు బృహత్తర ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ప్రయోగాత్మకంగా కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేర్ డ్యామ్, మిడ్ మానేర్, కడెం ప్రాజెక్టుల అంతర్భాగం నుంచి మట్టిని తీసి ఇసుకను వేరు చేసే ప్రక్రియ చేపట్టింది. అందుకు రూ. 1457 కోట్ల కాంట్రాక్ట్ ను ఈథర్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ అండ్ ట్రినిటీ సాండ్ అండ్ మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అండ్ సహారా డ్రెడ్జింగ్ లిమిటెడ్ దక్కించుకున్నాయి. గత ఏడాది 2025 మార్చి 24న కాంట్రాక్ట్ ఒప్పందం కుదుర్చుకుని హైడ్రో-సైక్లోన్ పద్ధతి ద్వారా లోయర్ మానేర్ డ్యామ్ లో పూడిక తీయడం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి శివారులోని రేణికుంట బ్రిడ్జి వద్ద ప్రారంభించారు.ప్రాసెసింగ్ ద్వారా గంటకు 20 క్యూబిక్ మీటర్ల ఇసుక వేరు చేసి విక్రయించే పనులు చేపట్టారు. రాష్ట్ర మంత్రులతోపాటు జిల్లా కలెక్టర్, సిపి ప్రాజెక్టును సందర్శించి పనితీరును పరిశీలించి అభినందించారు. ఆపై అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ కంపెనీలు ప్రభుత్వ లక్ష్యాన్ని పక్కదారి పట్టిస్తూ ఆదాయ వనరుగా మార్చుకుని అక్రమ దందా సాగించడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారి కోట్లాది రూపాయల ప్రజాధనం కాంట్రాక్టు కంపెనీల జేబుల్లో చేరుతుంది అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి

**ఆదాయం కోసం అక్రమ దందా**

ప్రభుత్వం లక్ష్యాన్ని నీరుగార్చేందుకు కాంట్రాక్టు కంపెనీలు ఆదాయం కోసం అక్రమ దందాకు తెరలేపడం వివాదస్పదంగా మారింది. మానేరు జలాశయంలోని అంతర్భాగంలో నీళ్ళలో నుంచి పూడిక తీస్తు ఇసుక వేరు చేసి సొమ్ము చేసుకోవడం వర్క్ అవుట్ కాకపోవడంతో అడ్డదారి తొక్కడం వివాదస్పదంగా మారింది . తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి శివారులోని మానేరు బ్యాక్ వాటర్ వద్ద పనులు చేపట్టిన కాంట్రాక్టర్, గత నెలలో మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను తీసేందుకు యత్నించారు. దీంతో స్థానికులు అడ్డుకోవడం తో బడా కంపెనీ భాగోతం బట్టబయైంది. ఆదాయం కోసం అధికారులు అధికారపార్టీ నేతలు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడం సర్వత్రా చర్చానీయాంశంగా మారి అదికారుల తీరు అధికార పార్టీ నేతల వ్యవహారం పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## సొంత అన్న, వదినను కిరాతకంగా హత్య చేసిన తమ్ముడు



**చంపాపేట్,ఫ్లాష్ ఇండియా :** కుటుంబ కలహాల నేపథ్యంలో పాతబస్తీలో జరిగిన డబుల్ మర్డర్ కలకలం సృష్టించింది. సొంత తమ్ముడే.. అన్నవదినను హత్య చేయడంతో రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. హైదరాబాద్ నగరంలోని మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చేసిన ఈ దారుణమైన డబుల్ మర్డర్లకు సంబంధించిన వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించారు. వారు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం..సుల్తాన్‌పురా ప్రాంతానికి చెందిన ఆదిల్ ఖాన్ సోమవారం మధ్యాహ్నం తన సొంత అన్న అఖీల్ ఖాన్, ఆయన భార్య అజ్మేరీ బేగంను కిరాతకంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. గత కొంతకాలంగా కుటుంబంలో కొనసాగుతున్న వ్యక్తిగత విభేదాలే ఈ హత్యలకు కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘర్షణ తారస్థాయికి చేరడంతో ఆదిల్ ఖాన్ తీవ్ర ఆగ్రహంతో ఈ దారుణానికి పాల్పడినట్లు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే మీర్‌చౌక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. హత్యలకు గల అసలు కారణాలను వెలికితీయాల్సి ఉందని, కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేసపోలీసులు తెలిపారు. కాగా, డబుల్ మర్డర్ జరగడంతో సుల్తాన్‌పురా, మీర్‌చౌక్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజల్లో భయాందోళనలు వ్యాపించడంతో పోలీసులు అదనపు బలగాలను మోహరించి గట్టి భద్రతను ఏర్పాటు చేశారు.



# హుజూరాబాద్‌లో 'డంపింగ్ యార్డ్' సెగ..

**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** హుజూరాబాద్ మండలంలోని సిరసపల్లి శివారులో ప్రభుత్వం ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్(వేస్ట్ ఎనర్జీ ప్లాంట్)కు వ్యతిరేకంగా ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడుతోంది. ఈ ప్లాంట్ ఏర్పాటును నిరసిస్తూ హుజూరాబాద్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు సోమవారం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలను పోలీసులు ప్రధాన గేటు వద్దే నిలిపివేయడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఆగ్రహించిన నిరసనకారులు కలెక్టరేట్ ఎదుటే ప్లకార్డులు, ఫ్లెక్సీలతో బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ నినాదాలు చేశారు.

**30 రోజులుగా ఆందోళనలు.. పట్టించుకోని సర్కార్..**

ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్ వ్యతిరేక అఖిలపక్ష కమిటీ నాయకులు మాట్లాడుతూ.. గత 30 రోజులుగా హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో శాంతియుతంగా దీక్షలు చేపడుతున్న, ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రజల గోడు ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని వారు మండిపడ్డారు. పట్టణ వ్యర్థాలను గ్రామాల మీదకు నెట్టడం ఏంటని వారు ప్రశ్నించారు. "ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే సారవంతమైన భూములు విషతుల్యమవుతాయి. భూగర్భ జలాలు కలుషితమై వ్యవసాయం కుంటుపడుతుంది. గాలి కలుషితం కావడం వల్ల చిన్నారులు, వృద్ధులు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది" అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాడి పంటలకు నిలయమైన ఈ ప్రాంతాన్ని ఉరిశాలగా మార్చవద్దని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**ఉద్యమం ఉద్భతం చేస్తాం..**

తక్షణమే ఈ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ ప్రతిపాదనను రద్దు చేయాలని, లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డంపింగ్ యార్డ్ వ్యతిరేక అఖిలపక్ష నాయకులు పలకల ఈశ్వర్ రెడ్డి, గుడిపాటి జైపాల్ రెడ్డి,సర్పంచ్ కటుకూరి మల్లారెడ్డి, వేల్పుల ప్రభాకర్, మార్త రవీందర్, తునికి సమ్మయ్య, కొలిపాక సమ్మయ్య, బెల్లి రాజయ్య, బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు తూర్పాటి రాజు, రామ్ రాజేశ్వర్, గుమ్మడి ఎల్లయ్య, పస్నుల స్వామి జయవర్ధన్, సందెల వెంకన్న, కొలిపాక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేను క్రూర మృగాన్ని కాదు

**మందమర్రి,ఫ్లాష్ ఇండియా :** మందమర్రిలో ఆదివారం రోజు జరిగిన తండ్రి, కూతురుల సంఘటన సెన్సేషన్ అయ్యింది. కూతురును చెట్ల పొదల్లోకి తీసుకెళ్లడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ వీడియో ఒక్కసారిగా సోషల్ మీడియాలో, కొన్ని ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారం అవడంతో ఒక్కసారిగా జిల్లా ప్రజలను విస్మయానికి గురి చేసింది. వీటి పై వివరణ కోసం మందమర్రి ప్రెస్ క్లబ్‌లో తండ్రి కామెరా ఆనంద్ వివరణ ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే చదువుకు దూరంగా ఉంటూ అల్లరి చేష్టలు చేస్తున్న తన కూతురు ఉన్నతంగా చదువుకుని, అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆలోచనతో అడవి ప్రాంతంలో పులులు, సింహాలు, జంతువులకు తన కూతురు రియాన్సిక భయపడుతుందన్న విషయాన్ని గుర్తించిన తండ్రి కామెరా ఆనంద్, ఆదివారం మందమర్రిలోని సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ వెనుకల పోచమ్మ తల్లి ఆలయం పక్కన ఉన్న చెట్లలోకి తీసుకెళ్లాడు. ఈ అడవిలో పులులు, సింహాలు, విషసర్పాలు ఉంటాయని, చదువుకోకపోతే ఇక్కడే వదిలేస్తానని బెదిరించానని తప్ప మరే విధంగానూ కాదని ఆయన మందమర్రి ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు తన కూతురు చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సదుద్దేశంతో సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ వెనుక గల చెట్లను చూపించి అడవి అంటే ఇదేనని, చదువుకోకుంటే ఇక్కడ వదిలేస్తానని బెదిరింపు కోసమే తీసుకువెళ్లానని తెలిపారు. తన కూతురు బుద్ధిగా చదువుకుంటానని చెప్పడంతో బండిమీద తీసుకువస్తున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి వీడియో తీసి వాట్సాప్‌లోని ఒక గ్రూపులో పోస్ట్ చేయడంతో తనపై అసభ్యకర పదజాలంతో దూషిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై మందమర్రి ఎస్సై నరేష్ పోలీస్ స్టేషన్‌కు పిలిచి విచారణ చేపట్టి ఇందులో ఎలాంటి తప్పు జరగలేదని వదిలేశారని, మంచిర్యాల జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో సభ్యులు కూడా తనను, తన కూతురు రియాన్సికను గంటసేపు విచారించి తండ్రి సంరక్షణలో క్షేమంగా ఉంటుందని సంతకం తీసుకొని పంపించారని చెప్పారు. సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారం ద్వారా సమాజంలో తమ కుటుంబం తలెత్తుకోలేకపోతుందని, తాను కనబడితే కొట్టడానికి కూడా జనాలు మీదికి వస్తున్నారని భయాన్ని వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ప్రచారాలను పూర్తి వివరాలు సేకరించిన తర్వాతే పోస్టులు పెట్టాలని, ఈ తప్పుడు ప్రచారాలతో కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉంటుందని వేడుకున్నారు. ప్రభుత్వ అధికారులే విచారణ చేపట్టి ఇందులో ఎలాంటి తప్పు లేదని నిర్ధారించారని ప్రజలందరూ గ్రహించాలని, తన కూతురు ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఈ పని చేశానని వెల్లడించారు.

# అమరులకు స్వేచ్ఛా నివాళి



**ఉట్నూర్,ఫ్లాష్ ఇండియా :** ఇంద్రవెల్లి పోరుగడ్డ పులకరించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండోసారిగా పోలీసు ఆంక్షలు లేకుండా సోమవారం ఆదివాసీ గిరిజన అమరవీరుల సంస్మరణ దినం అధికారికంగా అమరవీరులకు ఆదివాసీలు ఘనంగా నివాళులర్పించారు. 1981 ఏప్రిల్ 20న జల్, జంగల్, జమీన్ పేరిట నినాదించి అమరులైన ఆదివాసీ వీరులకు నివాళులు అర్పించడానికి వారి కుటుంబ సభ్యులు, బంధువులు, జిల్లా ఆదివాసీలు ఘననివాళులు అర్పించారు. ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో పూజలు ఇంద్రవెల్లి అమరవీరులకు నివాళులర్పించడానికి మండలంలోని వారి కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసీ గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా మండల కేంద్రంలోని గోండుగూడ గ్రామ పటేల్ మడావి ఇంద్రు ఇంటి నుంచి ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాల మధ్య ర్యాలీ నిర్వహించి ఆదివాసీల ఆరాధ్య దైవం ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి అమరవీరుల స్థూపం వద్దకు చేరుకొని ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలతో స్తూపం వద్దకు చేరుకొని ఎరుపు రంగు జెండాను ఆవిష్కరించారు. ఆదివాసీ గిరిజనులతో పాటు కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.

**నివాళ్ళు అర్పించిన ప్రముఖులు..**

ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్మృతివనంలో సోమవారం నిర్వహించిన వేడుకలకు ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎంపీ సోయం బాపూరావ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాదవ్ నరేష్, ఆత్రం సుగుణక్క, ఆదివాసి నాయకులతో కలిసి స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అధికారికంగా సంస్కరణ దినోత్సవం సందర్భంగా అమరుల కుటుంబాలకు అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. అలాగే స్థలం ఇప్పించి స్థలం పై ఇందిరమ్మ ఇల్లు మంజూరు ఇప్పించారని, స్మృతి వన అభివృద్ధి భాగంగా కాంపౌండ్ వాల్ పై సోలార్ కరెంటు అలాగే బోర్ వెల్ మంజూరు చేయించామని, అటవి ప్రాంతాలలో ఉన్న గిరిజన గుడాలల్లో ఇళ్ల సమస్య త్రీ ఫేస్ సమస్య వాటర్ సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. ఆదివాసీలకు ఆర్వోఎఫ్ఆర్ ద్వారా భూహక్కు కల్పించామని పేర్కొన్నారు. ఏజెన్సీలోని సమస్యలను పరిష్కరించేలా ఐటీడీఏ పీఓ, అటవీ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. స్మృతి వనాన్ని 15 లక్షలతో మరింత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడు అత్రం భుజంగ రావు రచించిన ఆ గాయానికి 44 ఏళ్లు పేరిట ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మరోవైపు స్తూపం వద్ద, పరిసర ప్రాంతంలో ఉట్నూర్ సీఐ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ మాట్లాడుతూ ఇంద్రవెల్లి ఘటనలో మిగిలిన అమరులైన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఇంద్రవెల్లి స్తూపం వద్ద నివాళ్లు అర్పించేందుకు గతంలో ఇబ్బందులు పడ్డారని కేసీఆర్ ప్రభుత్వంలో నివాళి ఆంక్షలను సడలింపు ఇవ్వడంలో స్వేచ్ఛగా నివాళి అర్పించారన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ గిరిజన ప్రజలకు అందే స్కీం పై అవగాహన కల్పించాలని, ఆడపిల్లలకు చదువు చాలా ముఖ్యమని తెలిపారు. ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ స్మృతి వనస్థూపం అభివృద్ధి మూడు నెలల్లో పూర్తి అయ్యే విధంగా చూసామని తెలిపారు. అలాగే గిరిజన గ్రామాల్లో నీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి నీటి సమస్య తలెత్తకుండా కావలసిన బోర్వెల్, బావి ఇంజనీరింగ్ శాఖ ద్వారా మంజూరు అయ్యే విధంగా చూస్తామని అన్నారు. విద్య అనేది విద్యార్థులకు భవిష్యత్తు విద్యార్థుల చదువు మానేయకుండా చూడాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని గ్రామ పటేళ్లకు, సార్ మేడి నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు, సార్మేడీలు, పటేళ్లు, ఆదివాసి ప్రజలు పాల్గొన్నారు.

# బుద్ధారం గురుకుల పాఠశాలలో కలెక్టర్ తనిఖీ..



**గోపాల్ పేట,ఫ్లాష్ ఇండియా :** వనపర్తి జిల్లా గోపాల్పేట మండల పరిధిలోని బుద్ధారం గండి గురుకుల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, అందులో భాగంగానే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గోపాలపేట మండలం బుద్ధారం గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల వంటగది (కిచెన్), మెస్‌ను పరిశీలించారు. కిచెన్,మెస్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆహార సామాగ్రి నిల్వ రిజిస్టర్లను పరిశీలించి, మెస్ కమిటీ విద్యార్థులు రిజిస్టర్లలో సంతకాలు చేస్తున్నారా లేదా అనే అంశంపై విచారణ చేశారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారికి అందుతున్న సదుపాయాలు, హాస్టల్ సమస్యలు తదితర అంశాలపై విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే ఆహారాన్ని సూపర్వైజర్ ముందుగా రుచి చూసి, అనంతరం విద్యార్థులకు అందించాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు.విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాల పంపిణీ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆర్ బీ ఎస్ కే ఆధ్వర్యంలో కంటి పరీక్ష శిబిరాల ద్వారా మొత్తం 6950 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, 570 మందికి చూపు సమస్యలు ఉన్నట్లు గుర్తించగా, ఈ పాఠశాలలో 400 మంది విద్యార్థుల్లో 69 మందికి చూపు సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈ విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు అయిన OP Tibre wala Foundation, హైదరాబాద్ టైటాన్స్ రౌండ్ టేబుల్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉచితంగా కొత్త కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నితిన్, అభిషేక్, అఖిల్ పాల్గొన్నారు. ఉచితంగా కళ్లద్దాలు అందించిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు కళ్లద్దాలను సరిగ్గా ఉపయోగించుకొని, విద్యలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాలల్లో సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యాలను నిబద్ధతతో సాధించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సాయినాథ్ రెడ్డి, డి వై ఎస్ ఓ సుధీర్ రెడ్డి, ప్రిన్సిపల్ ఆరోగ్య, సిబ్బంది,డాక్టర్ కృష్ణకుమారి,చాంద్ పాషా, సిబ్బంది సిద్ధ గౌడ్ సిస్టర్లు, ఆశ వర్కర్లు పాఠశాల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి అభివృద్ధిని ఓర్వలేకనే లక్ష్మణ్ కుమార్‌పై విమర్శలు..



**గొల్లపల్లి,ఫ్లాష్ ఇండియా :** ధర్మపురి నియోజకవర్గంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ లక్ష్మణ్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని గొల్లపల్లి మండల కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన విమర్శలకు ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధర్మపురిలో పదేళ్లలో మీరు ఏర్పాటు చేయలేని నైట్ కాలేజీ, డిగ్రీ కాలేజీలు రెండేళ్లలోనే లక్ష్మణ్ కుమార్ ఏర్పాటు చేశారని అన్నారు. అలాగే ధర్మపురిలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్, గొల్లపల్లిలో రూ. 18 కోట్లతో గురుకుల పాఠశాల భవనాలు లక్ష్మణ్ కుమార్ కృషితోనే మంజూరయ్యాయని అన్నారు.

**సాగు నీరు అందడం లేదని ఆగ్రహం..**

లక్ష్మణ్ కుమార్ చేస్తున్న అభివృద్ధికి నిదర్శనంగానే మొన్న జరిగిన మున్సిపల్ ఎలక్షన్‌లో ధర్మపురిలో 15కు 15 సీట్లు కాంగ్రెస్ పార్టీ కైవసం చేస్తుందని అన్నారు. కొప్పుల ఈశ్వర్ తాను అధికారంలో ఉండగా, కమీషన్లకు ఆశపడి గోదావరి నీటిని సిద్దిపేట, హైదరాబాద్‌కు తరలించారని ఫలితంగా మండలంలోని గోవిందపల్లె, చిల్వకోడూరు, లొత్తునూర్, బొంకూర్, అబ్బపూర్ వంటి గ్రామాలకు సాగు నీరు అందడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి ధర్మపురి నియోజకవర్గ రైతులకు తీవ్ర అన్యాయం చేసిన కొప్పుల ఈశ్వర్‌కు లక్ష్మణ్ కుమార్‌ను విమర్శించే నైతిక హక్కులేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి గౌడ్, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, ఉప సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



# మాపై నిందారోపణలు చేశారు!

ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఎట్టకేలకు బోణీ కొట్టింది. ఆదివారం ఈడెన్ గార్డెన్స్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించి ఈ సీజన్‌లో మొదటి విజయాన్ని అందుకుంది. ఆరు మ్యాచ్‌ల్లో ఐదు ఓడి (ఓ మ్యాచ్ రద్దు) పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న కేకేఆర్.. చివరికి ఏడో మ్యాచ్‌లో గెలుపు రుచి చూసింది. దాంతో కోల్‌కతా ప్లేయర్స్ భావోద్వేగం చెందారు. డ్రెస్సింగ్ రూమ్‌లో ప్రతిఒక్కరూ కన్నీళ్లు పెట్టుకున్నారని మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి వెల్లడించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన చక్రవర్తి.. జట్టు విజయంపై తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. గత కొన్ని వారాలుగా జట్టుకు ఎదురైన కష్టాలను గుర్తు చేస్తూ.. ఈ విజయం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోందని తెలిపాడు.'చాలా సంతోషంగా ఉంది. నా గురించి మాట్లాడే ముందు మొత్తం కోచింగ్ స్టాఫ్‌కు క్రెడిట్ ఇవ్వాలి. గత కొన్ని వారాలు మాకు కఠినంగా గడిచాయి. మాకు విజయాలు లేవు. బయట చాలా విమర్శలు వచ్చాయి. కానీ హెడ్ కోచ్, ఇతర కోచ్‌లు మా మీద ప్రభావం చూపకుండా చూసుకున్నారు. మేమంతా మా ప్రాసెస్‌పైనే దృష్టి పెట్టాము. అందుకే ఈ విజయానికి అందరం అర్హులమే. ఇది ఒక్క విజయం అయినా కూడా చాలా బాగా అనిపిస్తోంది. మా డ్రెస్సింగ్‌రూమ్‌లో అందరి కన్నీళ్లను చూశా. పదేళ్ల తర్వాత 2024లో మూడోసారి ఛాంపియన్‌గా నిలిచాం. అప్పుడు కూడా ఇలాంటి దృశ్యాలను చూడలేదు. ఇప్పుడు అందరూ భావోద్వేగం చెందారు' అని వరుణ్ చక్రవర్తి చెప్పాడు.'ఈరోజు ఏమి ప్రత్యేకం లేదు. ఐపీఎల్‌లో పిచ్‌లు ఎలా ఉంటున్నాయో అలానే ఉంది. ఈరోజు పిచ్ కొంచెం స్లోగా ఉంది. అది మాకు అనుకూలించింది. ప్రారంభంలో కొన్ని మ్యాచ్‌లు నేను ఆడలేదు. నాకు గాయం అయ్యింది. నా ఎడమ చేతిలో రెండు ఫ్రాక్చర్లు ఉన్నాయి. వాటిని మేనేజ్ చేస్తూ ఆడుతున్నాను. కాస్త కష్టం అవుతోంది కానీ సాధ్యమైనంతవరకు మంచి ప్రదర్శన ఇవ్వడానికి చూస్తున్నా. పిచ్ కొంచెం నెమ్మదిగా ఉన్నా.. మా ఆటకు సరిపోయింది. మధ్య ఓవర్లలో బ్యాటింగ్ ఇంకాస్త బాగా చేయవచ్చు అనిపిస్తోంది. మొత్తానికి సంతృప్తిగా ఉంది' అని చక్రవర్తి తెలిపాడు.'టోర్నీని ఎక్కడ ముగుస్తామో ఇప్పుడే చెప్పలేం. కానీ మేము పోటీకి వచ్చాం. కేవలం పాల్గొనడానికి కాదు, ప్రతి మ్యాచ్ గెలవడమే మా లక్ష్యం. ట్రోఫీ కోసం బలమైన పోటీదారులమని నిరూపించుకోవాలని చూస్తున్నాం. మాకు ఇంకా ఆశలు ఉన్నాయి. ఇకపై మేము మరింత బాగా ఆడుతాం' అని చక్రవర్తి చెప్పుకొచ్చాడు. సీజన్ ప్రారంభానికి ముందే హర్షిత్ రాణా, ఆకాశ్ దీప్ గాయాలతో దూరమయ్యారు. మతీశా పతిరన ఇప్పుడే జట్టులో చేరాడు. సరైన బౌలింగ్ లేకపోవడం కోల్‌కతాపై ప్రభావం చూపుతోంది.

# ఓటమికి ఏదో కారణం చెప్పడం కష్టం!



ఐపీఎల్ 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఓటమిని ఎదుర్కొంది. 255 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో లక్నో 200 పరుగులకే పరిమితమైంది. లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ మ్యాచ్ అనంతరం జట్టు ప్రదర్శనపై స్పందించాడు. తన ఎడమ మోచేతి గాయం గురించి మాట్లాడుతూ.. ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడుతోందని తెలిపాడు. అయితే ఈ మ్యాచ్‌లో కుడి చేతికి మరో గాయం (టాటూ లాంటిది) తగిలిందని సరదాగా వ్యాఖ్యానించి నవ్వులు పూయించాడు. పంజాబ్ పరాజయానికి ఏదో ఒక కారణం చెప్పడం కష్టమని పంత్ వెల్లడించాడు.మ్యాచ్‌లో ఎక్కడ తప్పు జరిగిందన్న ప్రశ్నకు రిషబ్ పంత్ మాట్లాడుతూ.. ఒక్క అంశాన్ని చూపించడం కష్టం అని అన్నాడు. బౌలర్లు మంచి ప్రదర్శన ఇస్తున్నప్పటికీ.. ఇంకా మెరుగుపడాల్సిన అంశాలు ఉన్నాయని పేర్కొన్నాడు. బ్యాటింగ్‌లో కూడా కొంత పాజిటివ్ సంకేతాలు కనిపించాయని, వాటితో ముందుకు సాగుతామని చెప్పాడు. జట్టుగా ప్రతి మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించాడు. ఓపెనర్‌గా ఆయుష్ బదోనిని పంపించడంపై స్పందిస్తూ.. ఇది ముందుగానే తీసుకున్న నిర్ణయం అని తెలిపాడు. టాప్ ఆర్డర్‌లో స్వేచ్ఛగా ఆడే అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని, మిడిల్ ఆర్డర్ కూడా బాధ్యత తీసుకోవాలని భావించామని వివరించాడు.'భారీ లక్ష్యాన్ని ఛేదించడం అంత సులువు కాదు. మేము ప్రయత్నం మాత్రం చేయగలిగాం. ప్రత్యర్థి జట్టు బాగా ఆడినప్పుడు మనం ఎంత చేసినా ఫలితం ఉపయోగం ఉండదు. పంజాబ్ జట్టు ప్రదర్శన అద్భుతం. మంచి క్రికెట్ ఆడిన జట్టుకు క్రెడిట్ ఇవ్వాల్సిందే. మా జట్టుపై పూర్తి నమ్మకం ఉంది. త్వరలోనే మంచి ఫలితాలు ఆదుకుంటాము' అని రిషబ్ పంత్ విశ్వాసం వ్యక్తం చేశాడు. జట్టులో సానుకూల వాతావరణం కొనసాగుతుందని, ముందున్న మ్యాచ్‌ల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని పంత్ స్పష్టం చేశాడు.

# భారత పౌరసత్వ ఆఫర్..




అఫ్గానిస్థాన్ స్టార్ క్రికెటర్ రషీద్ ఖాన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థి బ్యాటర్లకు చుక్కలు చూపిస్తుంటాడు. మూడు రోజుల క్రితం తనకు మగ బిడ్డ జన్మించినట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. తాజాగా భారత్, ఆస్ట్రేలియా నుంచి వచ్చిన పౌరసత్వ ఆఫర్ల విషయంలో సంచలన విషయాలను వెల్లడించాడు. ఆ దేశాల నుంచి వచ్చిన ఆఫర్లను తిరస్కరించినట్లు తెలిపాడు. అఫ్గానిస్తాన్ కే ప్రాతినిధ్యం వహించడానికే తాను కట్టుబడి ఉన్నానని తెలిపాడు. ఈ స్టార్ లెగ్-స్పిన్నర్ తనకు సంబంధించిన'రషీద్ ఖాన్: ఫ్రమ్ స్ట్రీట్స్ టు స్టార్‌డమ్' అనే పుస్తకంలో ఈ విషయాన్ని ప్రస్తావించాడు.ఈ పుస్తకంలో తన జీవితం గురించి విపులంగా వివరిస్తూ.. 2023 ఐపీఎల్ సీజన్‌కు సంబంధించిన ఒక సంఘటనను గుర్తుచేసుకున్నారు. 'భారత క్రికెట్‌కు చెందిన ఒక సీనియర్ వ్యక్తి నన్ను కలవాలనుకుంటున్నారని ఒక జట్టు అధికారి చెప్పారు. నేను వెళ్లి ఆ అధికారికి నమస్కరించాను. మా మధ్య సంభాషణ సాగుతున్న సమయంలో ఆయన ఒక మాట అన్నారు. 'మీ దేశంలో (అఫ్గానిస్థాన) పరిస్థితి చాలా దారుణంగా ఉంది. భారత్ వచ్చి ఉండండి. మేము మీకు భారతీయ పౌరసత్వం ఇస్తాము. ఇక్కడే క్రికెట్ ఆడండి. అయితే ఆయన మాటలకు నేను ఆశ్చర్యపోయాను, ఎలా స్పందించాలో నాకు తెలియలేదు. కానీ నేను నవ్వి, 'చాలా ధన్యవాదాలు. నేను నా దేశం కోసం మాత్రమే ఆడుతాను' అని పుస్తకంలో రాశాడు.అలానే ఆస్ట్రేలియా నుంచీ పౌరసత్వం, ఆడే అవకాశం వంటి ఆఫర్లు వచ్చాయని రషీద్ ఖాన్ తన పుస్తకంలో రాసుకొచ్చాడు. కాగా, రషీద్ ఖాన్ దేశభక్తి గతంలో కూడా వార్తల్లో నిలిచింది. 2018 ఐపీఎల్ సమయంలో భారత అభిమానులు ఆయనకు పౌరసత్వం ఇవ్వాలని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఈ అంశంపై అప్పటి విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ స్పందిస్తూ, పౌరసత్వ నిర్ణయాలు హోం మంత్రిత్వ శాఖ పరిధిలో ఉంటాయని తెలిపారు. అఫ్గానిస్థాన్‌లోని నంగర్‌హార్ వీధుల నుంచి అంతర్జాతీయ క్రికెట్‌లో అగ్రస్థానానికి ఎదిగిన రషీద్ ఖాన్ ప్రయాణం ఎంతో ప్రేరణాత్మకంగా ఉంటుంది. మొత్తంగా రషీద్ తీసుకున్న ఈ నిర్ణయం దేశభక్తి, విలువలపై నిలబడే ధైర్యానికి ప్రతీకగా నిలుస్తోంది.

# మా విజయ రహస్యం అదే..



ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్) జైత్రయాత్ర కొనసాగుతోంది. ఈ సీజన్లో ఓటమి ఎరుగని జట్టు ఏదైనా ఉందంటే.. అది పీబీకేఎస్ టీమ్ మాత్రమే. ఇప్పటివరకు ఆడిన ఆరు మ్యాచ్‌లలో ఐదు గెలవగా, ఓ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ వరుస విజయాలకు కారణం ఏంటో పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వెల్లడించాడు. తాను ప్రత్యేకంగా ఎలా ఆడాలనే సూచనలు ఆటగాళ్లకు ఇవ్వనని, వారు తమ శైలిలో ఆడితేనే మంచి ఫలితాలు వస్తాయని నమ్ముతానని తెలిపాడు. మ్యాచ్‌కు ముందు కోచ్ రికీ పాంటింగ్ ప్రోత్సహిస్తారని, తాను కొన్ని మాటలు చెప్పి జట్టును ఉత్తేజపరుస్తానని శ్రేయస్ చెప్పాడు.మ్యాచ్ అనంతరం శ్రేయస్ అయ్యర్ మట్లాడుతూ... 'చాలా సంతోషంగా ఉంది. ప్రియాంశ్ ఆర్య, కూపర్ కనోలీ బాగా ఆడారు. ఇద్దరి భాగస్వామ్యం అద్భుతం. కొన్ని షాట్లు ఆశ్చర్యానికి గురి చేశాయి. ఫాస్ట్ బౌలర్లను బ్యాక్‌ఫుట్‌పై స్ట్రెట్‌గా ఆడటం, స్పిన్నర్లను కూడా అదే ధైర్యంతో ఎదుర్కోవడం అంటే మాటలు కాదు. ధైర్యం, నిలకడ రెండూ అవసరం. ఎందుకంటే మ్యాచ్ ఎప్పుడైనా చేతిలో నుంచి జారిపోవచ్చు. కానీ ఇద్దరు మిడిల్ ఓవర్లలో ఆ భాగస్వామ్యాన్ని నిర్మించిన తీరు అద్భుతం. ఇప్పుడే కూపర్, ప్రియాంశ్‌తో మాట్లాడుతున్నాను. ఈ ఐపీఎల్‌లో ఎవరు ఎక్కువ సిక్సర్లు కొడతారో అనే పోటీ పెట్టుకుందాం అనుకున్నాం. మేమంతా సిద్ధంగా ఉన్నాం. గెలిచిన వారికి నా బ్యాట్ బహుమతిగా ఇస్తాను. వాళ్లు బాగా ఆడినా, నేనూ బాగా ఆడితే నాకు సంతోషమే' అని చెప్పాడు.'నా అభిప్రాయం ప్రకారం ఆటగాళ్లను స్వేచ్ఛగా వదిలేస్తేనే ప్రతిభను బయటపెడతారు. అదే మా జట్టు మంత్రంగా మారింది. ప్రతి ఒక్కరికి తమ తమ విధానాలు, అలవాట్లు ఉంటాయి. వాటితోన ప్లేయర్స్ ఫలితాలు సాధిస్తున్నారు. కాబట్టి నేను ఎక్కువగా చెప్పాల్సిన అవసరం లేదు. వేము మాట్లాడుకుంటాం, మ్యాచ్‌కు ముందు రికీ మోటివేట్ చేస్తాడు. నేనూ కొద్దిగా మాట్లాడుతా. తర్వాత ఆటగాళ్లు మైదానంలో ఫలితం చూపిస్తారు. మా జట్టులో ఉన్న బౌలర్లలో చాలా మంది అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లు. వాళ్లు తమ దేశాల తరఫున అద్భుతంగా రాణించారు. అనుభవం కూడా చాలా ఉంది. కాబట్టి వారికి ఎక్కువగా చెప్పాల్సిన అవసరం లేదు. మేము కొన్ని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. ప్రత్యేకంగా కొందరు బ్యాటర్లకు వ్యూహాలు రూపొందిస్తాం. తర్వాత అమలు చేయడమే ముఖ్యం. ఈరోజు వారు బౌలింగ్ చేసిన తీరు, ఈ సీజన్ మొత్తం చూపుతున్న ప్రదర్శన నిజంగా అద్భుతం. ఇలానే కొనసాగాలి. ఇప్పటివరకు అన్నీ బాగా జరుగుతున్నాయి' అని శ్రేయస్ చెప్పుకొచ్చాడు.

# బిజినెస్



## తవ్వకాలకు అంతా సిద్ధం..

భారతదేశంలో బంగారం అంటే కేవలం ఒక లోహం మాత్రమే కాదు, అది సంప్రదాయానికి చిహ్నం, సురక్షితమైన పెట్టుబడి. ముఖ్యంగా తెలుగు మగువలకు పసిడిపై ఉన్న మక్కువ అంతా ఇంతా కాదు. పెళ్లిళ్లు, పండుగలు వచ్చాయంటే చాలు, ధర ఎంతున్నా కొనుగోళ్లు జోరుగా సాగుతాయి. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్‌లో బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్న వేళ, భారత్‌లో సొంతంగా బంగారు గనుల తవ్వకాలు ప్రారంభం కావడం ఒక తీపి కబురుగా మారింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే తొలి ప్రైవేట్ బంగారు గని తవ్వకాలకు సిద్ధం కావడం విశేషం.

**ఏపీలో పసిడి సిరి..**

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా జొన్నగిరి వద్ద దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ గోల్డ్ మైన్ (బంగారు గని) ప్రారంభానికి సిద్ధమైంది. 'డెక్కన్ గోల్డ్ మైన్స్' సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ మే 2026 మొదటి వారం నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. గత కొన్ని ఏళ్లుగా జరుగుతున్న అన్వేషణలు ముగిసి, ఇప్పుడు వాణిజ్యపరమైన ఉత్పత్తికి ముహూర్తం ఖరారైంది.


**భారీ నిక్షేపాలు.. సిద్ధంగా పసిడి!**

తాజా నివేదికల ప్రకారం.. ఈ ప్రాంతంలో భారీ ఎత్తున బంగారు నిక్షేపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జొన్నగిరి గనుల్లో సుమారు 42.5 టన్నుల బంగారు నిక్షేపాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇందులో దాదాపు 13.1 టన్నుల బంగారాన్ని తక్షణమే వెలికితీయడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రైవేట్ భాగస్వామ్యం కావడంతో అత్యాధునిక యంత్రాలను ఉపయోగించి తక్కువ సమయంలోనే ఎక్కువ పసిడిని సేకరించేలా ఏర్పాట్లు చేశారు.

**ఆర్థిక వ్యవస్థకు బూస్ట్..**

భారత్ ఏటా వేల టన్నుల బంగారాన్ని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల విదేశీ మారక ద్రవ్యం భారీగా ఖర్చవుతోంది. ఏపీలో ప్రారంభం కానున్న ఈ గని ద్వారా దేశీయంగా ఉత్పత్తి పెరిగి, దిగుమతులపై భారం కొంత తగ్గే అవకాశం ఉంది. అంతేకాకుండా, స్థానికంగా వందలాది మందికి ఉపాధి లభించనుంది. మొత్తానికి.. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రారంభం కానున్న ఈ 'గోల్డ్ రష్' భవిష్యత్తులో దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త వెలుగులు తీసుకురానుంది.

## ఐసీఐసీఐ బ్యాంక్ లాభాల జోరు..




దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ నాలుగో త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను నమోదు చేసింది. 2026 ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చి కాలానికి బ్యాంక్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 9.28 శాతం వృద్ధి చెంది రూ.14,755 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో బ్యాంక్ లాభం రూ.13,502 కోట్లుగా ఉంది. ఈ త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.55,595 కోట్లకు చేరుకుంది. గత ఏడాది క్యూ4లో ఇది రూ.47,442 కోట్లుగా ఉండేది. అయితే, బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 7.7 శాతం పెరిగి రూ.20,568 కోట్లుగా నమోదైంది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంక్ నికర లాభం రూ.54,233 కోట్లుగా ఉంది. ఇది గత ఏడాది లాభం (రూ.48,591 కోట్లు) కంటే 11.6 శాతం ఎక్కువ కావడం విశేషం. అద్భుతమైన ఫలితాల నేపథ్యంలో బ్యాంక్ బోర్డు తన వాటాదారులకు ప్రతి షేరుపై రూ.12 డివిడెండ్ ప్రకటించింది. అదేవిధంగా బ్యాంక్ ఆస్తుల నాణ్యత మెరుగుపడి గ్రాస్ ఎన్‌పీఏ 1.88 శాతం నుంచి 1.81 శాతానికి తగ్గింది.

## బీహెచ్ఈఎల్ షేర్ల జోరు..

భారత ప్రభుత్వ రంగ దిగ్గజం భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ వ్యాపార పరంగా సరికొత్త లక్ష్యాల దిశగా అడుగులు వేస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరం నాటికి కంపెనీ ఆర్డర్ బుక్ గణనీయంగా పెరగనుందనే వార్తలు మార్కెట్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. పవర్, ఇండస్ట్రియల్ రంగాల నుంచి భారీగా ప్రాజెక్టులు దక్కించుకునే అవకాశం ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. థర్మల్ పవర్ ప్రాజెక్టుల పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించడంతో బీహెచ్ఈఎల్‌కు భారీ ప్రాజెక్టులు దక్కే అవకాశం ఉంది. అలాగే పారిశ్రామిక విభాగంలో కూడా డిమాండ్ పెరగడం కంపెనీకి కలిసొచ్చే అంశం.

**వృద్ధి పథంలో షేర్ ధర..**

గత కొంతకాలంగా బీహెచ్ఈఎల్ షేర్లు మెరుగైన ఫలితాలను ఇస్తున్నాయి. ఆర్డర్ ఇన్-ఫ్లో బలంగా ఉండటం వల్ల దీర్ఘకాలిక పెట్టుబడిదారులు ఈ స్టాక్ పట్ల ఆశాజనకంగా ఉన్నారు. స్టాక్ మార్కెట్ విశ్లేషకులు ఈ కంపెనీ వ్యాపార నమూనాపై సానుకూలత వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాల రంగానికి ఇస్తున్న ప్రాధాన్యత కారణంగా బీహెచ్ఈఎల్ షేరు ధర రాబోయే కాలంలో మరింత పుంజుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. కేవలం పవర్ రంగానికి పరిమితం కాకుండా, రక్షణ , రవాణా రంగాల్లో కూడా తన ఉనికిని చాటుకోవాలని బీహెచ్ఈఎల్ ప్లాన్ చేస్తోంది.



## హర్మ్యూజ్ జలసంధి మూసివేత!

సీజ్ ఫైర్ నేపథ్యంలో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మళ్లీ వేడెక్కింది. హర్మ్యూజ్ జలసంధి వద్ద అమెరికా నౌకాదళం ఓ ఇరాన్ కార్గో నౌకను బలవంతంగా స్వాధీనం చేసుకోవడంతో ఉద్రిక్తతలు పీక్స్‌కు చేరుకున్నాయి. ఈ పరిణామంతో ఇరు దేశాల మధ్య ఉన్న తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ప్రమాదంలో పడింది. అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనాన్ని ధిక్కరించి వెళ్తున్న 'టౌస్కా' అనే ఇరాన్ నౌకపై అమెరికా దాడి చేసింది. నౌక ఇంజిన్ రూమ్‌ను ధ్వంసం చేసి, అమెరికా మెరైన్లు దానిని తమ ఆధీనంలోకి తీసుకున్నారని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించారు.

**ఇరాన్ హెచ్చరిక..**

ఇరాన్‌పై నౌకపై అమెరికా చర్యను సముద్రపు దొంగతనంగా ఇరాన్ అభివర్ణించింది. దీనిపై త్వరలోనే తగిన రీతిలో ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ సైన్యం హెచ్చరించింది. ఈ ఘటన తర్వాత ఇరాన్ హోర్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేసింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు ఒక్కసారిగా 7.5 శాతానికి మేర పెరిగి ఇన్వెస్టర్లలో ఆందోళన కలిగించాయి. మరోవైపు ఉద్రిక్తతలను తగ్గించేందుకు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ఫోన్‌లో చర్చలు జరిపారు. ఇస్లామాబాద్‌లో రెండో విడత శాంతి చర్చలు జరపాలని పాక్ ప్రయత్నిస్తున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్ అందుకు విముఖత చూపుతోంది. ఒకవేళ ఇరాన్ చర్చలకు రాకపోతే ఆ దేశంలోని విద్యుత్ కేంద్రాలు, వంతెనలను ధ్వంసం చేస్తామని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ఇప్పటికే హెచ్చరించారు.



## దిగొచ్చిన బంగారం ధరలు

మహిళలకు బంగారం అంటే ఎంతో ఇష్టం ఉంటుందనే విషయం తెలిసిందే. ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా బంగారం కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం దేశంలో అక్షయ తృతీయ కొనుగోళ్లతో జువెలరీ దుకాణాలు కళకళలాడుతున్నాయి. ఈ తరుణంలో బంగారం ధరలు దిగిరావడం గమనార్హం.

హైదరాబాద్ బులియన్ మార్కెట్లో పసిడి ధరలు ఈరోజు(సోమవారం) తగ్గాయి. అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా ధరలు తగ్గడం మహిళలకు శుభవార్త అనే చెప్పవచ్చు. ఈరోజు 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 450 మేర తగ్గి రూ. 1,42,350 గా ఉంది. ఇక 24 క్యారెట్ల బంగారం రేటు 10 గ్రాములపై రూ. 490 మేర తగ్గి రూ. 1,55,290 గా ఉంది. ఈరోజు వెండి ధరల్లో ఏ మార్పు లేదు. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రేటు రూ. 2,80,000 ఉంది.

**బంగారం ధర హైదరాబాద్‌లో ఎంతంటే?**

22 క్యారెట్ల బంగారం ధర-రూ.1,42,350
24 క్యారెట్ల బంగారం ధర-రూ.1,55,290

బంగారం ధర విజయవాడలో ఎంతంటే?

22 క్యారెట్ల బంగారం ధర-రూ.1,42,350
24 క్యారెట్ల బంగారం ధర-రూ.1,55,290




# పరశురామ్ భారీ అనౌన్స్‌మెంట్!

భారతీయ చలనచిత్ర రంగంలో భారీ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన హోంబలే ఫిల్మ్స్, నేడు ఒక పవర్‌ఫుల్ అప్‌డేట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. గతేడాది విడుదలైన 'మహావతార్: నరసింహ' బాక్సాఫీస్ వద్ద సృష్టించిన ప్రభంజనం మనందరికీ తెలిసిందే. ఇప్పుడు ఆ యానిమేటెడ్ ఎపిక్ ఫ్రాంచైజీలో భాగంగా రెండో చిత్రం 'మహావతార్ పరశురామ్' టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు.హోంబలే ఫిల్మ్స్ మరియు క్లీమ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా శ్రీమహావిష్ణువు దశావతారాల నేపథ్యంలో మొత్తం 7 చిత్రాలను రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. 2025లో వచ్చిన 'నరసింహ'తో ఈ ప్రయాణం మొదలైంది. ఇప్పుడు రెండో భాగం పరశురాముడి అవతారంపై రాబోతోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రం డిసెంబర్ 2027లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ ప్రకటన సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ భీభత్సంగా ఉంది. "ధర్మం పతనమైనప్పుడు, పరశు (గొడ్డలి) లేస్తుంది" అనే ట్యాగ్ లైన్‌తో ఈ పోస్టర్ వై-రల్ అవుతోంది.అధర్మాన్ని అంతం చేసి, లోకంలో ధర్మాన్ని నిలబెట్టే పరశురాముడి పాత్రను దర్శకుడు అశ్విన్ కుమార్ అత్యంత శక్తివంతంగా తెరకెక్కిస్తున్నారు. కేవలం పిల్లల కోసం మాత్రమే కాకుండా, పెద్దలను కూడా అలరించేలా అంతర్జాతీయ స్థాయి విజువల్స్‌తో ఈ యానిమేటెడ్ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం హోంబలే ఫిల్మ్స్ చేతిలో 'కాంతార: చాప్టర్ 1', 'సలార్ 2' వంటి భారీ చిత్రాలు ఉండగానే, ఇలాంటి పౌరాణిక యానిమేటెడ్ చిత్రాలను ప్రకటించడం విశేషం. ఈ చిత్రానికి సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నారు.




# 'బ్లడీ రోమియో' కూడా ఆలస్యం కానుందా?

నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం ది ప్యారడైజ్ చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమాను ఈ ఏడాది ఆగస్టు 21న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే ఈ సినిమా నిజంగా ఈ సంవత్సరం ఆగస్టులో విడుదల అవుతుందా లేదా అనే విషయంలో ప్రస్తుతానికి పూర్తి స్థాయిలో స్పష్టత లేదు. అందుకు ప్రధాన కారణం ఇప్పటికీ ఈ మూవీకి సంబంధించిన చాలా భాగం షూటింగ్ పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఒకవేళ ఈ సినిమా గనుక ఆగస్టులో విడుదల అయినట్లయితే, నాని ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన బ్లడీ రోమియో సినిమా అనుకున్న సమయానికి పట్టాలెక్కే అవకాశం ఉంటుంది. ఒకవేళ ది ప్యారడైజ్ సినిమా కాస్త ఆలస్యమైనా, బ్లడీ రోమియో చిత్రానికి కూడా బ్రేక్ పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.అందుకు ప్రధాన కారణం బ్లడీ రోమియో చిత్రాన్ని లండన్‌లో ఎక్కువ భాగం చిత్రీకరించాలనేది మేకర్స్ ప్లాన్. అక్కడ షూటింగ్ నిర్వహించాలంటే వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండాలి. ఒకవేళ ది ప్యారడైజ్ సినిమా అనుకున్న సమయానికి పూర్తికాకపోతే, లండన్‌లో వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి రావచ్చు. ఆ కారణంతో కూడా ఈ సినిమా ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇకపోతే ఓజీ వంటి భారీ ప్రాజెక్ట్ తర్వాత సుజిత్ నుండి వస్తున్నా మూవీ కావడంతో 'బ్లడీ రోమియో'పై భారీ అంచనాలు నెలకొనే అవకాశాలు చాలా వరకు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# పూరి ప్రస్థానంపై విజయ్ సేతుపతి

టాలీవుడ్ టాలెంటెడ్ దర్శకుడు పూరి జగన్నాథ్, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా రూపొందిన 'బద్రి' సినిమాతో దర్శకుడిగా తన కెరీర్‌ను ప్రారంభించారు. ఈ చిత్రం 2000 సంవత్సరం ఏప్రిల్ 20న విడుదలైంది. ఈ మూవీ విడుదలై నేటికి 26 సంవత్సరాలు పూర్తవడంతో, పూరి జగన్నాథ్ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 26 ఏళ్లు పూర్తి చేసుకున్నట్లైంది. ఈ సందర్భంగా అనేకమంది సినీ ప్రముఖులు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇకపోతే ప్రస్తుతం పూరి జగన్నాథ్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి హీరోగా రూపొందుతున్న 'స్లమ్‌డాగ్ -- 33 టెంపుల్ రోడ్' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ సినీ పరిశ్రమలో 26 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తన 'X' ఖాతా ద్వారా ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.సినీ పరిశ్రమలో 26 ఏళ్ల ప్రయాణం అనేది కేవలం ఒక మైలురాయి మాత్రమే కాకుండా, ధైర్యం, నమ్మకం మరియు భయంలేని స్వరంతో నిర్మించుకున్న గొప్ప వారసత్వమని విజయ్ సేతుపతి పేర్కొన్నారు. ఇదే సందర్భంగా, పూరి జగన్నాథ్‌తో కలిసి 'స్లమ్‌డాగ్ -- 33 టెంపుల్ రోడ్' సినిమాలో పని చేసిన అనుభవాన్ని కూడా ఈ నటుడు గుర్తు చేసుకున్నారు. నటులుగా తమపై నమ్మకం ఉంచి, కంఫర్ట్ జోన్‌ను దాటి మరింత మెరుగైన నటన చూపించేలా ప్రోత్సహించే దర్శకులు చాలా అరుదుగా ఉంటారని, ఆ విషయంలో పూరి జగన్నాథ్ ప్రత్యేకమైన వ్యక్తి అని తెలిపారు. అలాగే, 'స్లమ్‌డాగ్ -- 33 టెంపుల్ రోడ్' చిత్రం తమ అందరికీ ఎంతో ప్రత్యేకంగా నిలిచిపోతుందని విజయ్ సేతుపతి ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా పూరి జగన్నాథ్ మరెన్నో విజయాలు సాధిస్తూ ప్రభావవంతమైన కథలను ప్రేక్షకులకు అందించాలని కోరుకుంటూ ఆయనకు గౌరవాభివందనాలు తెలిపారు. విజయ్ సేతుపతి చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతోంది.




# మాస్ ఇమేజ్ కోసం ట్రై...

హీరోయిజం అంటే కేవలం హీరోలకేనా కాదు అని నిరూపిస్తున్నారు నేటి తరం కథానాయికలు. టాలీవుడ్ నుండి బాలీవుడ్ వరకు హీరోయిన్ సెంట్రిక్ యాక్షన్ సినిమాల హవా నడుస్తోంది. సమంత, రష్మిక, నయనతార వంటి స్టార్స్ ఇప్పుడు కత్తులు పట్టి, కండలు తిరిగిన విలన్లను చిత్తు చేస్తూ థియేటర్లలో ఈలలు వేయిస్తున్నారు. యాక్షన్ సినిమాలను నమ్ముకుని తన కెరీర్‌ను కొత్త పుంతలు తొక్కిస్తోంది సమంత. 'ఫ్యామిలీ మ్యాన్ 2'లో రాజీ పాత్రతో తనలోని యాక్షన్ కోణాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన ఆమె, 'యశోద', 'సిటాడెల్' సిరీస్‌లలో హై-వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్స్‌తో అదరగొట్టింది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రంలో కూడా సమంత ఒక పవర్‌ఫుల్ యాక్షన్ రోల్‌లో కనిపించబోతోంది. కేవలం యాక్షన్‌ను మాత్రమే నమ్ముకుని ఆమె చేస్తున్న ఈ ప్రయోగాలు సామ్ ఇమేజ్‌ను శిఖరానికి చేరుస్తున్నాయి. నేషనల్ క్రష్ రష్మిక మందన్న సైతం ఇప్పుడు ఉమెన్ సెంట్రిక్ యాక్షన్ మూవీ 'మైసా' తో సత్తా చాటడానికి సిద్ధమైంది. ఈ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం రష్మిక బ్యాంకాక్ వెళ్లి మరీ ప్రత్యేక శిక్షణ పొందుతోంది. రోజుకు ఏకంగా 8 గంటల పాటు కఠినమైన యాక్షన్ ట్రైనింగ్‌లో పాల్గొంటూ శారీరకంగా తనను తాను మలుచుకుంటోంది. ఈ సినిమా రష్మిక కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. లేడీ సూపర్ స్టార్ నయనతార తన తదుపరి చిత్రం 'రక్కయి'లో ఊచకోత కోయడానికి సిద్ధమైంది. ఇప్పటికే విడుదలైన టీజర్ చూస్తుంటే ఇది అవుట్ అండ్ అవుట్ మాస్ యాక్షన్ ఫిల్మ్ అని అర్థ-మవుతోంది. మరోవైపు సంయుక్త మీనన్ కూడా రూట్ మార్చింది. 'అఖండ 2'లో ఆమె ఫైటింగ్‌తో అలరించబోతుండగా, ఆమె ప్రధాన పాత్రలో వస్తున్న 'ది బ్లాక్ గోల్డ్' చిత్రం కూడా కంప్లీట్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. మొత్తానికి తెలుగు హీరోయిన్లు ఇప్పుడు 'బ్యూటీ'తో పాటు 'పవర్'ను కూడా చూపిస్తూ బాక్సాఫీస్ వద్ద తమదైన ముద్ర వేస్తున్నారు.

# డెకాయిట్ బయటకు రప్పించింది!



'డెకాయిట్' బెంగళూరు సెలబ్రేషన్స్‌లో ఉన్నప్పుడు కొంతమంది కలిశారు. తమిళనాడుకు చెందిన ఒక లాయర్ కలిసి తనకు జరిగిన ఒక సంఘటన గురించి చెప్పాడు. తనను ఎవరో 150 మంది కలిసి కొట్టారట. చాలాకాలం హాస్పిటల్‌లో ఉన్నాడు. బయటకు రావాలంటే భయమేసిందని, తనకు ధైర్యం ఇచ్చింది 'మేజర్' సినిమా అని చెప్పాడు. 'డెకాయిట్' రిలీజ్ అవుతుందని తెలుసుకుని హాస్పిటల్ నుంచి బయటికి వచ్చి మొదటిగా ఈ సినిమానే చూశానని చెప్పాడు. సినిమా చాలా నచ్చిందని, నన్ను కలవడానికి ప్రత్యేకంగా వచ్చానని చెప్పాడు. చాలా ఎమోషనల్‌గా మాట్లాడాడు. అప్పుడు నాకు అర్థమైంది.. మనము సినిమా, బిజినెస్ గురించి ఆలోచిస్తూ మానవత్వాన్ని ఎక్కడో మర్చిపోతాం. ఆయన నాకు ఆ మానవత్వాన్ని మళ్లీ గుర్తు చేశాడు. నేను ఎందుకు సినిమాలు చేస్తున్నానో గుర్తు చేశాడు. అలాగే 'మేజర్ సందీప్' ఫ్యాన్ పేజ్ నిర్వహిస్తున్న వారు ఒక పబ్లిక్ ఫంక్షన్‌లో పెట్టుకోమని నాకు ఇండియన్ ఫ్లాగ్ ఇచ్చారు. ఇంత ప్రేమను ప్రేక్షకులు, మీడియా నుంచి పొందుతున్నప్పుడు.. ఇదే క్రెడిబిలిటీ అనిపిస్తుంది. హార్డ్ వర్క్ చేస్తేనే సక్సెస్ వస్తుంది. అందుకే నాకు 'గుడ్ సినిమా' శేష్ అనే ట్యాగ్ రావాలని కోరుకున్నాను. అలాంటి సంతృప్తి ఈ సినిమా ఇచ్చింది. ఆ బెంగళూర-ులో ఆ లాయర్ ని కలిసినప్పుడు వచ్చిన అనుభూతి నాకు ఒక షీల్డ్‌లా అనిపించింది అన్నారు.




# నిధి అగర్వాల్‌కు సూపర్ ఛాన్స్..

విజయాలు పెద్దగా లేకపోయినా మంచి క్రేజ్ సంపాదించుకున్న యువ నటీమణుల్లో నిధి అగర్వాల్ ఒకరు. ఈమె 'సవ్యసాచి' చిత్రంతో తెలుగు తెరకు పరిచయ-ఎమైంది. ఆ సినిమా ఫెయిల్ అయినప్పటికీ, నిధి అగర్వాల్‌కు మాత్రం మంచి గుర్తింపు లభించింది. ఇప్పటివరకు ఈమె పలు చిత్రాల్లో నటించినప్పటికీ, 'ఇస్మార్ట్ శంకర్' సినిమాను మినహాయిస్తే పెద్దగా విజయాలు దక్కలేదు. తాజాగా ఈ హీరోయిన్ నటించిన 'రాజా సాబ్' చిత్రం భారీ అంచనాల నడుమ ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. అయితే ఈ సినిమా కూడా ఈ ముద్దుగుమ్మకు నిరాశనే మిగిల్చింది. ఈమె నటించిన సినిమాలు వరుసగా ఫెయిల్ అవుతుండడంతో కొంతమంది నిధి అగర్వాల్‌కు 'ఐరన్ లెగ్' అనే ముద్రను కూడా వేశారు.ఇక ఆ ముద్రను చెరిపేసే అవకాశం ఈ నటికి వచ్చిందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మాస్ మహారాజా రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో త్వరలో ఓ సినిమా ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో నిధి అగర్వాల్‌ను హీరోయిన్‌గా తీసుకోవాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు సమాచారం. ఇప్పటివరకు రవితేజ-గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోయే నాలుగో చిత్రం కూడా విజయం సాధిస్తే నిధి అగర్వాల్‌కు ఉన్న 'ఐరన్ లెగ్' ఇమేజ్ 'గోల్డెన్ లెగ్'గా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఈ ఏడాది లేనట్టేనా?..




డార్లింగ్ ప్రభాస్ ఫ్యాన్స్ ఎంతో ఈగర్ గా వెయిట్ చేస్తున్న సీక్వెల్స్ లో 'సలార్ 2' ఒకటి. మొన్నటి వరకు ఈ ఏడాది చివరిలో ఈ సీక్వెల్ కు సంబంధించిన షూటింగ్ స్టార్ట్ అవుతుందని వార్తలు రాగా.. ఇప్పుడు షూటింగ్ ఆగిపోయే పరిణామాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. దర్శకుడు ప్రశాంత్ నీల్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ తో 'NTRNeel' పై దృష్టి సారించగా.. ప్రభాస్ 'ఫౌజీ', 'స్పిరిట్' చిత్రాలతో బిజీగా ఉన్నాడు. వీరిద్దరూ 2026 చివరి నాటికి తమ ప్రస్తుత ప్రాజెక్టులను పూర్తి చేస్తారని భావిస్తున్నారు. అన్నీ షెడ్యూల్ ప్రకారం జరిగితే, ఆ తర్వాత వెంటనే చిత్ర బృందం 'సలార్' చిత్రీకరణను ప్రారంభించే అవకాశం ఉంది. అయితే.. ఇది పూర్తి అయ్యే సరికి ఈ ఏడాది కంప్లీట్ అవుతాది కాబట్టి.. ఈ సీక్వెల్ బహుశా 2027 ప్రారంభంలో షూటింగ్ మొదల వ్వచ్చని తెలుస్తుంది. సలార్: పార్ట్ 1 – సీజ్ ఫైర్ కు లభించిన బలమైన స్పందన నేపథ్యంలో, ఈ సీక్వెల్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి.




# ఏంది 'పెద్ది' ఇది..

ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ది చిత్రం గురించి జరుగుతున్న ప్రచారం అంతా ఇంతా కాదు. ఏప్రిల్ 30న రిలీజ్ కావాల్సిన ఈ సినిమా.. జూన్‌కి వాయిదా పడింది. కానీ, డేట్ మాత్రం ఫిక్స్ చేయలేదు మేకర్స్. దీంతో పెద్ది రిలీజ్ విషయంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ సినిమా షూటింగ్ ఇంకా కంప్లీట్ కాలేదు. స్పెషల్ సాంగ్‌తో పాటు ప్యాచ్ వర్క్ పెండింగ్‌లో ఉంది. దానికి తోడు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ డిలే అవుతోంది. అసలు.. పెద్ది పోస్ట్‌పోన్‌కు మెయిన్ రీజన్ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. అంతేకాదు.. రీ షూట్ చేస్తున్నారనే న్యూస్ వైరల్ అవుతోంది.ఇలా ఒకటి కాదు.. పెద్ది గురించి ఏదో ఒక పుకారు షికారు చేస్తునే ఉంది. దీంతో.. పెద్ది జూన్‌లో కూడా రావడం కష్టమనే వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే, మేకర్స్ పెద్ది కొత్త రిలీజ్ డేట్ ప్రకటిస్తే ఇంత రచ్చ జరిగేది కాదు. కానీ, అలా జరగలేదు. ఇప్పటికే రెండు సార్లు పోస్ట్‌పోన్ అయిన ఈ సినిమా.. మరోసారి వాయిదా పడకూడదనే ఉద్దేశ్యంతో.. ఈసారి జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు మేకర్స్. సరైన అవుట్ పుట్ వచ్చి.. ఆల్ సెట్ అనుకున్నప్పుడే డేట్ ప్రకటించేలా ప్లాన్ చేసుకుంటున్నారు. అయినా కూడా పుకార్లు మాత్రం ఆగడం లేదు. నిజం చెప్పాలంటే.. ఈ సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచే మెగా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్ర యూనిట్‌తో పాటు ఇండస్ట్రీ వర్గాల్లో పెద్ది ఎప్పుడొచ్చిన బాక్సాఫీస్ బద్దలవుతుందనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటి వరకు రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ కూడా అలాగే ఉంది. కాబట్టి.. పెద్ది లేట్ అయినా పర్లేదనే కామెంట్స్ అభిమానుల నుంచి వస్తున్నాయి. అయితే, ఈ సినిమాను జూన్ 4 లేదా 25న రిలీజ్ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# 'ఉస్తాద్'కి ఓటీటీలో షాకింగ్ రెస్పాన్స్




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ -- హరీష్ శంకర్ కాంబినేషన్‌లో గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వచ్చిన చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. ఈ సినిమాపై పవన్ అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులు కూడా మంచి అంచనాలు పెట్టుకున్నారు. అలా మంచి అంచనాల నడుమ మార్చి 19వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రానికి నెగటివ్ టాక్ వచ్చింది. దాంతో ఈ సినిమా పెద్దగా వసూళ్లను రాబట్టలేకపోయింది. విడుదలైన తర్వాత కొన్ని రోజులకే ఈ చిత్రం ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సంస్థ దక్కించుకుంది.ఇక బాక్సాఫీస్ వద్ద ఫెయిల్యూర్ అయిన ఈ సినిమా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో మాత్రం అద్భుతమైన రెస్పాన్స్‌ను దక్కించుకుంటోంది. ప్రస్తుతం ఈ సినిమా పదికి పైగా దేశాల్లో టాప్ ట్రెండింగ్‌లో కొనసాగుతున్నట్లు సమాచారం. బాక్సాఫీస్ వద్ద ఫెయిల్యూర్ అయినప్పటికీ, ఈ సినిమా ఓటీటీలో అద్భుతమైన స్పందనను అందుకుంటుండటంతో పవన్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నట్లు తెలుస్తోంది. ఇకపోతే ఈ సినిమాలో పవన్ కళ్యాణ్‌కు జోడిగా శ్రీలీల, రాశి ఖన్నా నటించగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మించారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రానికి ఎస్.ఎస్. తమన్ నేపథ్య సంగీతాన్ని అందించారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**